నీలగిరి ఎక్స్‌ప్రెస్
తెలుగు దినపత్రిక
RNI - TELTEL/2023/87644
సంపుటి: 03 | సంచిక: 83 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | సోమవారం 21 సెప్టెంబర్ 2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00


**నీలగిరి నిత్యపద్యం**

ఆటవలది

మనదు పల్లె బావి మధురమైన జలము,
కడుగనుప్పుగున్న కడలినీరు
సుజన,కుజన మైత్రి సూత్రమ్మునిదియేను
ఆచితూచి వేయుమదుగు నెపుడు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


**విలేకరులు కావలెను**

నీలగిరి ఎక్స్‌ప్రెస్ దినపత్రిక మరియు చైతన్యగళం ఛానెల్ లో పనిచేయుటకు మండల విలేఖర్లు, నియోజకవర్గ,జిల్లా ఇంచార్జీలు, క్రైమ్ రిపోర్టర్లు కావలెను.

**పూర్తి వివరాలకు**

తెలంగాణ - 9705770909,
ఆంధ్రప్రదేశ్ -9491163914
లను సంప్రదించగలరు.


# ఎల్‌నినోను

## సవాలుగా ఎదుర్కోవాలి

- 79 శాతం భూముల్లోనే ఖరీఫ్ సాగు
- [illegible]
- [illegible] పంపిణీ
- రూ.60 కోట్ల కంటింజెన్సీ నిధులు
- పప్పు, చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం
- హైరిస్క్ ఉద్యాన పంటలకు రక్షణ
- ఉద్యాన పంటలకు రూ.190 కోట్ల కేటాయింపు
- పంట నష్టాలను ముందే గుర్తించాలి
- నిత్యావసరాల ధరలు అదుపులో ఉండాలి
- జలధార కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలి
- హంద్రీ-నీవాతో కరవు ప్రాంతాలకు నీరు
- నీటి వనరుల సమర్థ వినియోగం
- సాగునీటి ప్రాజెక్టులు వేగంగా పూర్తి చేయాలి
- భవిష్యత్ కరవుకు ముందస్తు ప్రణాళిక
- ఎల్‌నినో ప్రభావంపై అధికారుల అప్రమత్తత
- ఎల్‌నినో ఎఫెక్ట్‌పై సీఎం సమీక్ష




ఎల్‌నినోను విపత్తుగా కాకుండా సవాలుగా ఎదుర్కొనేలా ముఖ్యమంత్రి చంద్రబాబు అధికార యంత్రాంగానికి దిశానిర్దేశం చేశారు. రైతును కాపాడటంతో పాటు నిత్యావసరాల ధరలు అదుపు తప్పకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. డిమాండ్‌కు అనుగుణంగా పంటల సాగు, పంటల బీమా, హైరిస్క్ ఉద్యాన పంటలకు రక్షణ, తాగునీరు--పశుగ్రాసం అందుబాటులో ఉంచడంపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావాన్ని తట్టుకునేందుకు ఇప్పటికే సిద్ధం చేసిన యాక్షన్, కంటింజెన్సీ ప్రణాళికలను క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేయాలని అధికారులకు ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఎల్‌నినో పరిస్థితులపై ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు.
ఇప్పటికే సిద్ధం చేసిన యాక్షన్ ప్లాన్ ప్రకారం ప్రతి ఒక్కరూ పనిచేయాలని సీఎం ఆదేశించారు. ఎల్‌నినో ప్రభావం రైతులపైనే కాకుండా అన్ని వ్యవస్థలపై ఉంటుందని స్పష్టం చేశారు. విపత్తుల

# ఏపీలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

- ♦ రాష్ట్రంలో 9 మంది ఐపీఎస్ అధికారులను బదిలీ చేసిన ప్రభుత్వం
- ♦ సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా జయలక్ష్మికి నియామకం
- ♦ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ ఐజీగా కాంతి రాణాకు పోస్టింగ్
- ♦ విశాల్ గున్నీకి శిక్షణ విభాగం డీఐజీగా బాధ్యతలు
- ♦ పల్నాడు, మార్కాపురం, పోలవరం జిల్లాలకు కొత్త ఎస్పీలు
- ♦ తక్షణమే బాధ్యతలు చేపట్టాలని ప్రభుత్వ ఆదేశాలు



# సర్‌తో 7.8 కోట్ల ఓట్లు గల్లంతు

- ★ ఎస్ఐఆర్‌పై కాంగ్రెస్ తీవ్ర ఆరోపణలు
- ★ ఓటర్ల తొలగింపుపై జైరాం రమేశ్ ఆందోళన
- ★ 7.8 కోట్ల ఓట్ల తొలగింపుపై విమర్శలు
- ★ మూడో దశలోనూ భారీగా ఓట్ల తొలగింపు
- ★ 5.43 కోట్ల మందికి నోటీసులు
- ★ బీజేపీ రాష్ట్రాల్లో పారదర్శకతపై ప్రశ్నలు
- ★ తెలంగాణలో 48.90 శాతం ఓట్లకు ముప్పు
- ★ ఢిల్లీ 53.73 శాతంతో ముందంజ
- ★ చండీగఢ్‌లో 52.58 శాతం ఓట్లకు ముప్పు
- ★ ఏపీలో 21.17 శాతం ఓట్లపై ఆందోళన
- ★ అద్వానీకీ ఎస్ఐఆర్ నోటీసు
- ★ జైశంకర్, రేఖా గుప్తాకూ నోటీసులు
- ★ మనీశ్ సిసోడియా కుటుంబానికీ నోటీసులు
- ★ మాజీ ఆర్మీ చీఫ్ ఉపేంద్ర ద్వివేదికి నోటీసులు
- ★ ప్రముఖులకూ ఎస్ఐఆర్ నోటీసులు



దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటర్ల జాబితాల ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ ముసుగులో కేంద్ర ప్రభుత్వం భారీ కుట్రకు తెరతీసిందని కాంగ్రెస్ ఆరోపించింది. కోట్ల మంది అర్హులైన ఓటర్ల పేర్లను జాబితాల నుంచి అధికారులు అక్రమంగా తొలగిస్తున్నారని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు. "కేంద్ర హోంమంత్రి అమిత్ షా కనుసన్నల్లోనే ఈ తతంగం నడుస్తోంది. ఎస్ఐఆర్ అంటే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్. కానీ ఇప్పుడు అది షా ప్రోద్భలంతో జరుగుతున్న ఓట్ల తొలగింపు(షా ఇన్‌స్టిగేటెడ్ రిమూవల్--ఎస్ఐఆర్) ప్రక్రియగా తయారైంది" అని ఆయన వ్యాఖ్యానించారు.

# కాంగ్రెస్ అభ్యర్థికి మమత మద్దతు



- నందిగ్రామ్‌లో అనూహ్య రాజకీయ మలుపు
- కాంగ్రెస్ అభ్యర్థికి మమత మద్దతు
- బరిలో నుంచి సంచిత ప్రధాన్ వైదొలగింపు
- మిలన్ ప్రధాన్ అరెస్టుతో కలకలం
- 2007 కేసుల్లో అరెస్టు సమయంపై కాంగ్రెస్ ప్రశ్నలు
- న్యాయ ప్రక్రియలో భాగమే: బీజేపీ
- టీఎంసీలో అంతర్గత సంక్షోభం
- పార్టీ పేరు, గుర్తుపై ఈసీ నిర్ణయం
- గడ్డి పువ్వు గుర్తు స్తంభింపు
- కాంగ్రెస్‌ను సోదర పార్టీగా అభివర్ణించిన మమత
- ఇండియా కూటమి బలోపేతమే లక్ష్యం
- నందిగ్రామ్‌లో కొత్త రాజకీయ సమీకరణం
- మిలన్‌కు బెయిల్‌పై ఉత్కంఠ
- అభ్యర్థి గైర్హాజరీలో ప్రచారంపై ఆసక్తి
- ఉప ఎన్నికపై పెరుగుతున్న ఉత్కంఠ
- అక్టోబర్ 6న నందిగ్రామ్‌లో పోలింగ్

నందిగ్రామ్‌లో వరుసగా చోటుచేసుకున్న పరిణామాలను చూస్తే.. ఇది కేవలం ఓ ఉప ఎన్నికకు సంబంధించిన పరిణామంగా మాత్రమే కనిపించడం లేదు. తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత సంక్షోభం, పార్టీ పేరు-గుర్తుపై ఎన్నికల సంఘం నిర్ణయం, మమతా బెనర్జీ వర్గం అభ్యర్థి పోటీ నుంచి తప్పుకోవడం, వెంటనే కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు మద్దతు ప్రకటించడం, ఆ తర్వాతే 2007 నందిగ్రామ్ కేసుల్లో ఆయన అరెస్టు కావడం.. ఇవన్నీ ఒకదాని వెంట ఒకటి జరగడంతో నందిగ్రామ్ రాజకీయ ప్రాధాన్యం మరింత పెరిగింది. మిలన్ అరెస్టుకు పెండింగ్‌లో ఉన్న 4 నాన్-బెయిలబుల్ వారెంట్లే కారణమని పోలీసులు చెబుతుండగా, అరెస్టు చేసిన సమయాన్ని కాంగ్రెస్, మమతా వర్గాలు ప్రశ్నిస్తున్నాయి. బీజేపీ మాత్రం ఇది న్యాయ ప్రక్రియలో భాగమేనని చెబుతోంది.

# నేపాల్ వరదల్లో హృదయవిదారకం

- 1,450 దాటిన మృతుల సంఖ్య
- 6,000 మంది ఆచూకీ కోసం గాలింపు
- నాలుగు వారాలైనా కొనసాగుతున్న గాలింపు చర్యలు
- భోటేకోశి నది ఉప్పొంగడంతో భారీ విధ్వంసం
- ఉత్తర, మధ్య నేపాల్‌లో తీవ్ర నష్టం
- వరదల్లో గల్లంతైన వారి కోసం కొనసాగుతున్న అన్వేషణ
- చిత్వన్‌లో అత్యధికంగా 367 మృతదేహాల వెలికితీత
- మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు



## కోదాడ మెగా జాబ్ మేళా

# రాష్ట్రంలో మైలురాయి : స్పీకర్

- గ్రామీణ యువతకు ఉద్యోగ అవకాశాలే లక్ష్యం
- ఒకే వేదికపై 350 కంపెనీలు
- 30 వేల మందికిపైగా ఉద్యోగార్థుల నమోదు
- 5,725 మంది అభ్యర్థులు షార్ట్‌లిస్ట్
- ఐదు జిల్లాల నుంచి భారీగా తరలివచ్చిన యువత
- ఐటీ, ఫార్మా, తయారీ రంగ సంస్థల భాగస్వామ్యం
- ప్రత్యక్ష ఇంటర్వ్యూలతో ఉద్యోగ ఎంపిక ప్రక్రియ
- గ్రామీణ యువత – కంపెనీల మధ్య వారధిగా జాబ్ మేళా

విద్యావంతులైన గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలను చేరువ చేయాలన్న లక్ష్యంతో నిర్వహించిన కోదాడ మెగా జాబ్ మేళా విజయవంతమైంది. రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చొరవతో సుమారు 350 కంపెనీలు ఒకే



వేదికపైకి రాగా, 30 వేల మందికిపైగా ఉద్యోగార్థులు నమోదు చేసుకున్నారు. వివిధ దశల్లో నిర్వహించిన ఇంటర్వ్యూల అనంతరం 5,725 మంది అభ్యర్థులు తదుపరి నియామక ప్రక్రియకు షార్ట్‌లిస్ట్ అయ్యారు. మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతిరెడ్డి నేతృత్వంలో సెప్టెంబర్ 19న నిర్వహించిన ఈ భారీ నియామక కార్యక్రమం గ్రామీణ నిరుద్యోగ సమస్యను ప్రధానాంశంగా తీసుకుంది.

# ట్రంప్‌నకు ఇరాన్ అల్టిమేటం

- ఖతార్ ద్వారా అమెరికాకు సందేశం.
- మరో అమెరికా దాడి జరిగే అవకాశం?
- ట్రంప్ స్పందనపై సస్పెన్స్?

ఇరాన్ సుప్రీం నేషనల్ సెక్యూరిటీ కౌన్సిల్ కార్యదర్శి మొహ్సెన్ రెజాయీ... ఈ విషయమై మాట్లాడుతూ అమెరికా ముందు తన ఇరాన్‌కు చెందిన ఏడు ప్రతిపాదనలను ఖతార్ మధ్యవర్తిత్వంతో అమెరికాకు చేరవేశాం. ప్రస్తుతం యుద్ధం మట్నదలై ఏడు నెలలు కావస్తుందని ఇరాన్ షరతులపై ట్రంప్ స్పందన కోసం ఎదురుచూస్తోన్నామన్నారు.



# ఎల్‌నినోను సవాలుగా ఎదుర్కోవాలి

సమయంలో వాటి ప్రభావం ప్రజలపై పడకుండా చూడటం ప్రభుత్వాల బాధ్యత అన్నారు. అధికారుల నిర్లక్ష్యం కారణంగా రైతులు, వినియోగదారులు ఇబ్బంది పడే పరిస్థితి రాకూడదని స్పష్టం చేశారు.

**50.7 శాతం లోటు వర్షపాతం :** ఎల్‌నినోను సవాలుగా స్వీకరించి సమన్వయంతో పనిచేయాలని ప్రజాప్రతినిధులు, అధికారులు, రైతులు, సాగునీటి సంఘాలకు సూచించారు. ఖరీఫ్ సాగు పరిస్థితులపై సమీక్ష సందర్భంగా రాష్ట్రంలో వర్షపాతం లోటును సీఎం చంద్రబాబు ప్రస్తావించారు. రాష్ట్రవ్యాప్తంగా 50.7 శాతం లోటు వర్షపాతం నమోదైందని తెలిపారు. ప్రకాశం, అన్నమయ్య, సత్యసాయి జిల్లాల్లో అత్యధిక లోటు ఉందని వెల్లడించారు. ఖరీఫ్‌లో 30.84 లక్షల హెక్టార్లలో సాగు జరగాల్సి ఉండగా 79 శాతం భూముల్లోనే సాగు పనులు ప్రారంభమయ్యాయని వివరించారు. పప్పుధాన్యాల సాగు మెరుగ్గా ఉన్నప్పటికీ నూనెగింజల సాగు తక్కువగా ఉందన్నారు. కర్నూలు, నంద్యాల, అనంతపురం జిల్లాల్లో పంటలపై ఎల్‌నినో ప్రభావం ఎక్కువగా ఉందని తెలిపారు. ఇప్పటికే సిద్ధం చేసిన కంటింజెన్సీ ప్లాన్‌ను పరిస్థితులకు అనుగుణంగా సమర్థంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రత్యామ్నాయ సాగు ఏర్పాట్లపై సమీక్షలో భాగంగా రైతులకు అందించిన విత్తనాలు, ఇతర వ్యవసాయ వనరులపై సీఎం చంద్రబాబు వివరాలు తెలుసుకున్నారు. 5.21 లక్షల హెక్టార్లకు పప్పుధాన్యాలు, చిరుధాన్యాలు, పచ్చిరొట్ట ఎరువులు సరఫరా చేశామని తెలిపారు. 1.31 లక్షల క్వింటాళ్ల విత్తనాలను 80 శాతం సబ్సిడీతో అందించామని చెప్పారు. ఖరీఫ్ కంటింజెన్సీ ప్రణాళిక కోసం రూ.60 కోట్లు సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. పప్పుధాన్యాలు, చిరుధాన్యాల సాగును మరింత ప్రోత్సహించాలని సూచించారు. వర్షాభావ పంటల వల్ల కలిగే ప్రయోజనాలను రైతులకు వివరించాలని ఆదేశించారు. సంప్రదాయేతర ప్రాంతాల్లో ఉల్లి, మిరప సాగును కూడా ప్రోత్సహించాలని సీఎం సూచించారు.

**పంటల పరిస్థితిని పరిశీలించాలి :** ఉద్యాన పంటలకు ఎల్‌నినోతో ఏర్పడే ముప్పుపై సమీక్ష సందర్భంగా ప్రభుత్వం చేపట్టిన రక్షణ చర్యలను సీఎం పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో ఉద్యాన పంటలపై హైరిస్క్ ఉందని తెలిపారు. ఈ పంటలను కాపాడేందుకు రూ.190 కోట్లు కేటాయించామని వెల్లడించారు. ఆ నిధులను పూర్తిస్థాయిలో సద్వినియోగం చేయాలని అధికారులను ఆదేశించారు. అధికారులు క్రమం తప్పకుండా క్షేత్రస్థాయిలో పర్యటించి పంటల పరిస్థితిని పరిశీలించాలని సూచించారు. కేంద్రం కొన్ని పంటలకు అందిస్తున్న కనీస మద్దతు ధరపై కేంద్రంతో సమన్వయం చేసుకోవాలని తెలిపారు. పంటలకు ఏర్పడే నష్టాన్ని ముందుగానే గుర్తించి అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. నిత్యావసరాల ధరల నియంత్రణపై సమీక్ష సందర్భంగా మార్కెట్‌లో సరఫరా, నిల్వల పరిస్థితిని ముఖ్యమంత్రి అధికారులను అడిగి తెలుసుకున్నారు. బియ్యం, ఉల్లి, పామాయిల్, కందిపప్పు ధరలను అదుపులో ఉంచాలని ఆదేశించారు. గోడౌన్లలో ఉన్న బియ్యం నిల్వల వివరాలను పరిశీలించాలని సూచించారు. అవసరమైన మేర బియ్యం నిల్వలను మార్కెట్‌లోకి విడుదల చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఉల్లి ధరలను నియంత్రించేందుకు వివిధ ప్రాంతాల నుంచి కొనుగోలు చేస్తున్నామని చెప్పారు. భవిష్యత్ డిమాండ్‌ను దృష్టిలో ఉంచుకుని ఉల్లి సాగును ప్రోత్సహించాలని సూచించారు. పామాయిల్, కందిపప్పు ధరల నియంత్రణకు ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలను వేగంగా అమలు చేయాలని ఆదేశించారు.

**అధికారులు చర్యలు చేపట్టాలి :** కూరగాయల సరఫరాను పెంచే ప్రత్యామ్నాయ మార్గాలపైనా సీఎం సమీక్షించారు. స్వయం సహాయక బృందాల ద్వారా కిచెన్ గార్డెన్లను ప్రోత్సహించాలని సూచించారు. వీటిని వ్యవస్థీకృతం చేయగలిగితే స్థానికంగా కూరగాయల ఉత్పత్తి పెంచవచ్చని తెలిపారు. ఉత్పత్తి పెరిగితే కూరగాయల ధరలను కూడా నియంత్రించే అవకాశం ఉంటుందని చెప్పారు. స్థానిక అవసరాలకు అనుగుణంగా కూరగాయల సాగును ప్రోత్సహించాలని ఆదేశించారు. రైతులకు మార్కెట్ డిమాండ్‌పై ముందుగానే సమాచారం అందించాలని సూచించారు. ఉత్పత్తి, సరఫరా, ధరల మధ్య సమతుల్యత ఉండేలా అధికారులు చర్యలు చేపట్టాలని సీఎం స్పష్టం చేశారు. ప్రతి ఒక్కరికీ తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని సీఎం సూచించారు. పశువులకు నీటితో పాటు పశుగ్రాసం అందేలా చూడాలని ఆదేశించారు. పశుగ్రాసం పెంచే చర్యలను వేగవంతం చేయాలని తెలిపారు. మల్చింగ్ కోసం అవసరమైన విత్తనాలను అందుబాటులో ఉంచాలని సూచించారు. పచ్చదనం ఏ మాత్రం తగ్గకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. వీబీ జీ రామ్‌జీ పనులను అనుసంధానం చేసుకుంటూ జలధార కార్యక్రమాన్ని ముమ్మరం చేయాలని సీఎం ఆదేశించారు. ఇప్పటికే తీసుకున్న నిర్ణయాలతో కరవు ప్రభావిత ప్రాంతాలకు నీటిని పంపగలుగుతున్నామని చంద్రబాబు తెలిపారు. హంద్రీ–నీవా ద్వారా చివరి భూములకు నీరందించామని చెప్పారు. ప్రస్తుతం తాగునీటికి ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకుంటున్నామని వివరించారు. ముందస్తు చర్యల వల్లే ఎల్‌నినో సమయంలోనూ హంద్రీ–నీవా కాల్వల్లో నీరు వస్తోందని తెలిపారు. నీటి వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. గత ప్రభుత్వం 2019--24 మధ్య నాటి ప్రభుత్వం కేవలం రూ.22 వేల కోట్లు మాత్రమే సాగునీటి కి ఖర్చు చేసిందని సీఎం విమర్శించారు. ప్రాజెక్టులు పూర్తయి ఉంటే ఎల్‌నినో వంటి విపత్తు పరిస్థితుల్లో ఇబ్బందులు ఉండేవి కావని అన్నారు. పూర్తయిన ప్రాజెక్టుల ద్వారా కరవు ప్రాంతాలకు నీటిని తరలించే అవకాశం పెరుగుతుందని తెలిపారు. మిగిలిన ప్రాజెక్టుల పనులను వేగంగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు. నీటి మౌలిక వసతులను బలోపేతం చేయడం ద్వారా భవిష్యత్ వర్షాభావ పరిస్థితులను ఎదుర్కోవచ్చని సీఎం స్పష్టం చేశారు.

# ఏపీలో భారీగా ఐపీఎస్‌ల బదిలీలు

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర పోలీసు శాఖలో కీలక మార్పులు చేపట్టింది. ఈ మేరకు 9 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ బదిలీల్లో పలు కీలక విభాగాలతో పాటు, మూడు జిల్లాలకు కొత్త ఎస్పీలను నియమించారు. వివరాల్లోకి వెళితే, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ (స్పాఫ్) డీజీగా ఉన్న సి.హెచ్. త్రివిక్రమ్ వర్మను ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీ (ఫీూ) డైరెక్టర్‌గా నియమించారు. అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) డైరెక్టర్‌గా పనిచేస్తున్న జయలక్ష్మిని సీఐడీ సైబర్ క్రైమ్స్ ఐజీగా బదిలీ చేశారు. ఏపీఎస్పీ బెటాలియన్ల ఐజీగా ఉన్న బి. రాజకుమారిని రైల్వేస్ ఐజీగా నియమిస్తూ, సీఐడీ మహిళా భద్రత విభాగం ఐజీగా అదనపు బాధ్యతలు అప్పగించారు. ముంబై నటి కాదంబరి జెత్వానీ వ్యవహారంలో అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారంటూ ఆరోపణలు ఎదుర్కొన్న ఐపీఎస్ అధికారులు కాంతి రాణా టాటా, విశాల్ గున్నీ సస్పెండైన సంగతి తెలిసిందే. ఇటీవలే ప్రభుత్వం వీరిద్దరిపై సస్పెన్షన్ ఎత్తివేసింది. దాంతో వారి పోస్టింగ్ కు మార్గం సుగమం అయింది. ఈ క్రమంలో ఈ ఇద్దరు అధికారులకు తాజా బదిలీల్లో పోస్టింగ్ ఇచ్చారు. కొంతకాలంగా పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న కాంతి రాణాకు ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ అండ్ రోడ్ సేఫ్టీ ఐజీగా కీలక బాధ్యతలు ఇచ్చారు. అదేవిధంగా, పోస్టింగ్ కోసం వేచి ఉన్న మరో అధికారి విశాల్ గున్నీకి శిక్షణ విభాగం డీఐజీగా బాధ్యతలు అప్పగించారు. గ్రేహౌండ్స్ డీఐజీగా ఉన్న బాబుజీ అట్టాడను టెక్నికల్ సర్వీసెస్ డీఐజీగా బదిలీ చేశారు. జిల్లా స్థాయిల్లోనూ కీలక మార్పులు చోటుచేసుకున్నాయి. పోలవరం ఓఎస్డీగా ఉన్న పంకజ్ కుమార్ మీనాను మార్కాపురం జిల్లా ఎస్పీగా నియమించారు. సీఐడీ ఎస్పీగా ఉన్న కె. చక్రవర్తిని పోలవరం జిల్లా ఎస్పీగా బదిలీ చేశారు. ఇక సీఎం సెక్యూరిటీ గ్రూప్ (సీఎంఎస్‌జీ) ఎస్పీగా ఉన్న జగదీశ్ అడహళ్లికి పల్నాడు జిల్లా ఎస్పీగా బాధ్యతలు అప్పగించారు. బదిలీ అయిన అధికారులు తక్షణమే తమ కొత్త బాధ్యతలు స్వీకరించాలని ప్రభుత్వం ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పరిపాలనా సౌలభ్యం, శాఖల బలోపేతం లక్ష్యంగా ఈ బదిలీలు చేపట్టినట్లు తెలుస్తోంది.

# సర్‌తో 7.8 కోట్ల ఓట్లు గల్లంతు

"ఎస్ఐఆర్ తొలి రెండు దశల్లోనే ఏకంగా 7.8 కోట్ల మంది ఓటర్ల పేర్లను తొలగించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ ప్రారంభానికి ముందున్న మొత్తం ఓటర్లలో ఇది దాదాపు 13 శాతానికి సమానం. మూడో దశలోనూ భారీ ఎత్తున ఓట్ల గల్లంతు జరుగుతోంది. మూడో దశలో 12 రాష్ట్రాలు, రెండు కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 36.06 కోట్ల మంది ఓటర్లను పరిశీలించగా, అందులో ఇప్పటికే 6.18 కోట్ల మంది పేర్లను తొలగించారు. ఓటరు జాబితాలో పేర్లను కొనసాగించుకోవాలంటే అదనపు పత్రాలు సమరి?పంచాలంటూ మరో 5.43 కోట్ల మందికి ఎన్నికల సంఘం నోటీసులు జారీ చేసింది. సరైన సమయంలో ఈ పత్రాలు సమరి?పంచకపోతే ఈ 15 శాతం మంది ఓటర్ల పేర్లు గల్లంతయ్యే ప్రమాదముంది" అని జైరాం ఆందోళన వ్యక్తంచేశారు.

**బీజేపీ పాలిత రాష్ట్రాల్లో గోప్యత :** "ఈ ప్రక్రియలో పారదర్శకత పూర్తిగా లోపించింది. కర్ణాటక, తెలంగాణ, జార్ఖండ్ లాంటి రాష్ట్రాల్లో తొలగింపు ప్రమాదం ఉన్న ఓటర్ల జాబితాలను ప్రజలకు అందుబాటులో ఉంచగా, ఢిల్లీలో ప్రజల ఒత్తిడి మేరకు సెపట?టంబర్ 19న విడుదల చేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఈ జాబితాలను కనీసం బహిర్గతం చేయకుండా గోప్యంగా ఉంచారు" అని దుయ్యబట్టారు. వివిధ రాష్ట్రాల్లో ఓట్లు కోల్పోయిన, తొలగింపు ప్రమాదం ఉన్న ఓటర్ల గణాంకాలను జైరాం రమేశ్ వెల్లడించారు. ఈ జాబితాలో ఢిల్లీ 53.73 శాతం ఓట్ల తొలగింపు ముప్పుతో తొలి స్థానంలో ఉండగా, చండీగఢ్ 52.58 శాతంతో రెండో స్థానంలో నిలిచింది. తెలంగాణలో ఏకంగా 48.90 శాతం మంది పేర్లు గల్లంతవడమో, నోటీసులు అందుకోవడమో జరిగి జాబితాలో మూడో స్థానంలో ఉందని వెల్లడించారు. జార్ఖండ్‌లో 39.57 శాతం, హరియాణాలో 37.5 శాతం, ఉత్తరాఖండ్‌లో 35.71 శాతం, మేఘాలయలో 35.36 శాతం, మహారాష్ట్రలో 33.88 శాతం ఓట్లకు గండం పొంచి ఉందని వివరించారు. కర్ణాటకలో 27.6 శాతం, ఒడిశాలో 23.67 శాతం, ఆంధ్రప్రదేశ్‌లో 21.17 శాతం, పంజాబ్‌లో 15.23 శాతం మేర ఓటర్లు జాబితా నుంచి గల్లంతయ్యే ప్రమాదంలో ఉన్నారని ఆరోపించారు.

**అద్వానీకి సర్ నోటీసు కేంద్ర మంత్రి జైశంకర్, ఢిల్లీ సీఎం రేఖా గుప్తాకు కూడా :** ఢిల్లీలో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) సర్వేలో పలువురు ప్రముఖులకు సైతం నోటీసులు జారీ అయ్యాయి. బీజేపీ దిగ్గజ నేత, మాజీ ఉప ప్రధాని ఎల్‌కే అద్వానీకి సైతం ఎస్ఐఆర్ నోటీస్ వచి?చంది. సర్ కింద అందజేసిన ధ్రువీకరణ పత్రాల్లో వ్యత్యాసాలున్నాయని, మరిన్ని ఆధారాలను సమర్పించాలని అధికారులు వారిని కోరారు. 98 ఏళ్ల అద్వానీతోపాటు ఆయన కుమార్తె ప్రతిభ, కోడలు గీతికలకూ ఈ నోటీసులు అందాయి. 2002 నాటి సర్ ఓటరు జాబితాలో వీరి పేర్లు లేవని పేర్కొన్నారు. మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్, ప్రస్తుత ఎలక్షన్ కమిషనర్ సుఖ్బీర్ సింగ్ సంధూ, విదేశాంగ మంత్రి ఎస్.జై శంకర్, ఆయన భార్య క్యోకో, విదేశాంగ శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ, మాజీ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయ వైస్‌ఛాన్సలర్ జగదీశ్ కుమార్, మాజీ ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ నజీబ్ జంగ్, మాజీ నీతి ఆయోగ్ ఉపాధ్యక్షుడు అరవింద్ పనగరియా, సెబీ ఛైర్మన్ తుహిన్ కాంత పండే, సీబీఐ డైరెక్టర్ ప్రవీణ్ సూద్, ఢిల్లీ మాజీ ఉపముఖ్యమంత్రి మనీశ్ సిసోడియా, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తాలకు సైతం ఎస్ఐఆర్ నోటీసులు వచ్చాయి. సిసోడియా, భార్య సీమ, కుమారుడు మీర్‌కూ నోటీసులందాయి. తల్లిదండ్రుల పేర్లలో వ్యత్యాసాలున్నాయంటూ మీర్‌కు పంపిన నోటీసులో పేర్కొన్నారు. సిసోడియా భార్య సీమకు పంపిన నోటీసులో ధ్రువీకరణ పత్రాలతో ఆమె పేరు సరిపోలడం లేదని పేర్కొన్నారు. ఢిల్లీలో నోటీస్‌లు అందుకున్న వాళ్ల పేర్లన్నీ ఢిల్లీ శాసనసభ పరిధిలో ఉన్నట్లు తెలుస్తోంది.

**మాజీ ఆర్మీ చీఫ్‌కు సైతం :** భారత ఆర్మీ మాజీ చీఫ్ ఉపేంద్ర ద్వివేది, ఆయన భార్యకు సైతం ఎస్ఐఆర్ నోటీసులు వచ్చాయి. మంత్రి ఎస్. జైశంకర్, సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రంజన్ దేశాయ్, ఆయన కుటుంబసభ్యులకు, ఆమ్ ఆద్మీ పార్టీ చీఫ్ కేజ్రీవాల్‌కూ ఈసీ అధికారులు ఎస్ఐఆర్ నోటీసులు అందజేశారు.

# నేపాల్ వరదల్లో హృదయవిదారకం

నేపాల్‌లో వరదలు ఎంతటి బీభత్సాన్ని సృష్టించాయో ప్రత్యేకించి చెప్పాల్సిన అవసరం లేదు. అకస్మాత్తుగా వచ్చిన వరదలు భయానక ప్రళయాన్ని సృష్టించి 1400 మందికి పైగా పొట్టన పెట్టుకున్నాయి. అయితే వరదల బీభత్సం సృష్టించి నాలుగు వారాలు గడుస్తోన్నా అందులో గల్లంతైన వారి ఆచూకీ ఇంకా లభించలేదు. దీంతో బాధితుల ఉనికిపై ఆందోళన వ్యక్తమవుతుంది. నేపాల్‌లో గత నెల సంభవించిన ఆకస్మిక వరదలకు నాలుగు వారాలు గడిచినా సహాయక, గాలింపు చర్యలు ఇంకా కొనసాగుతున్నాయి. సుమారు 6,000 మంది ఆచూకీ కోసం అధికారులు గాలింపు చర్యలు చేపడుతున్నారు.నేపాల్–టిబెట్ సరిహద్దుకు సమీపంలో ఉద్భవించిన ఈ భారీ వరదలు ఉత్తర, మధ్య నేపాల్‌లోని పట్టణాలు, గ్రామాలను తీవ్రంగా దెబ్బతీశాయి. ఇళ్లు, భవనాలు, వాహనాలు మాత్రమే కాకుండా ప్రజలు కూడా వరద ప్రవాహంలో కొట్టుకుపోయారు. భోటేకోశి నది ఉప్పొంగి భారీగా వరద నీటిని దిగువ ప్రాంతాలకు తీసుకెళ్లడంతో కొన్ని నిమిషాల్లోనే అనేక ప్రాంతాలు ధ్వంసమయ్యాయి.

**1,450 దాటిన మృతుల సంఖ్య :** నేపాల్ పోలీసుల ప్రకటన ప్రకారం, ఆగస్టు 26న సంభవించిన ఆకస్మిక వరదల్లో మృతుల సంఖ్య 1,451కి చేరింది. ప్రభావిత ప్రాంతాల నుంచి మరిన్ని మృతదేహాలను సహాయక బృందాలు వెలికితీయడంతో మృతుల సంఖ్య పెరిగింది. జిల్లాల వారీగా చూస్తే అత్యధికంగా చిత్వన్ జిల్లాలో 367 మృతదేహాలను అధికారులు వెలికితీశారు. రసువా జిల్లాలో 236, నావల్‌పరాసి ఈస్ట్‌లో 232, నావల్‌పరాసి వెస్ట్‌లో 222 మృతదేహాలు లభించాయి. అదేవిధంగా నువాకోట్ జిల్లాలో 203, గోర్ఖాలో 79, ధాదింగ్‌లో 72, తనహున్‌లో 38 మృతదేహాలను వెలికితీశారు. చికిత్స పొందుతూ కాఠ్మాండు ఆసుపత్రిలో మరో ఇద్దరు మరణించారు.

**మృతదేహాల గుర్తింపులో ఇబ్బందులు :** రెస్క్యూ, గాలింపు చర్యలు కొనసాగుతున్నప్పటికీ మృతదేహాలను గుర్తించడం అధికారులకు మరో పెద్ద సవాలుగా మారింది. వరద ప్రవాహంలో కొట్టుకుపోయిన అనేక మృతదేహాలు చాలాకాలం నీటిలో, బురదలో ఉండటంతో కుళ్లిపోయాయి. కొన్ని మృతదేహాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి, మరికొన్ని పూర్తిగా కాకుండా శరీర భాగాల రూపంలో మాత్రమే లభించాయి. దీంతో వాటిని గుర్తించడం కష్టంగా మారింది.

# కాంగ్రెస్ అభ్యర్థికి మమత మద్దతు

గతంలో పరస్పరం తీవ్రంగా పోరాడిన రెండు పార్టీల మధ్య నందిగ్రామ్ వేదికగా ఏర్పడిన అసాధారణ రాజకీయ సమీకరణాన్ని సూచిస్తోంది. అక్టోబర్ 6న జరగనున్న పోలింగ్ వరకు మిలన్ ప్రధాన్ బెయిల్ పొందుతారా, కాంగ్రెస్ ఆయన గైర్హాజరీలో ప్రచారాన్ని ఎలా కొనసాగిస్తుంది, కాంగ్రెస్‌కు మమతా మద్దతు ఎంతవరకు కొనసాగుతుంది, ఈ పరిణామాలు తృణమూల్ అంతర్గత సంక్షోభంపై ఎలాంటి ప్రభావం చూపుతాయన్నదే ఇప్పుడు నందిగ్రామ్‌లో కీలకంగా మారింది.

**కాంగ్రెస్ అభ్యర్థికి మమత మద్దతు :** పశ్చిమ బెంగాల్‌లోని నందిగ్రామ్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి మిలన్ ప్రధాన్‌కు తృణమూల్ కాంగ్రెస్ అధినేత్రి మమతా బెనర్జీ మద్దతు ప్రకటించారు. అక్టోబర్ 6న జరగనున్న ఉప ఎన్నిక బరిలో తమ వర్గం నుంచి నిలబెట్టిన సంచిత ప్రధాన్ పోటీ నుంచి తప్పుకున్న కొన్ని గంటలకే మమత ఈ నిర్ణయం తీసుకున్నారు. మిలన్ ప్రధాన్‌కు మద్దతు ప్రకటించిన మమత.. కాంగ్రెస్‌ను సోదర పార్టీ, సహజ మిత్రపక్షంగా అభివర్ణించారు. దేశ ప్రయోజనాల దృష్ట్యా, ఇండియా కూటమిని బలోపేతం చేయడానికే ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. బెంగాల్ నుంచి ప్రతిపక్ష కూటమి భవిష్యత్తుపై సందేశం ఇవ్వాలనుకుంటున్నట్లు పేర్కొన్నారు. నందిగ్రామ్‌తో పాటు రెజినగర్ ఉప ఎన్నిక నేపథ్యంలో తృణమూల్ కాంగ్రెస్‌లో అంతర్గత వివాదం నెలకొంది. ఈ వివాదం నేపథ్యంలో ఎన్నికల సంఘం తృణమూల్ కాంగ్రెస్ పేరు, సంప్రదాయ 'గడ్డి పువ్వు' గుర్తును స్తంభింపజేసింది. మమతా బెనర్జీ వర్గానికి, అసమ్మతి వర్గానికి వేర్వేరు పేర్లు, గుర్తులను కేటాయించింది. మిలన్ ప్రధాన్ నందిగ్రామ్ భూసేకరణ ఉద్యమానికి సంబంధించిన 2007 కేసులో మమత మద్దతు ప్రకటించిన కొద్దిసేపటికే అరెస్టయ్యారు. అనంతరం ఆయనను జైలుకు పంపారు. కాంగ్రెస్ నేతలు ఈ అరెస్టును విమర్శించారు. రాహుల్ గాంధీ దీనిని రాజకీయ కక్ష సాధింపుగా అభివర్ణిస్తూ పార్టీ పోరాడుతుందని అన్నారు. కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌధురి మాత్రం తాజా పరిణామాన్ని తక్షణ రాజకీయ సఖ్యతగా చూడొద్దని అన్నారు. మరోవైపు, బెంగాల్ ప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షుడు శుభంకర్ సర్కార్ మద్దతును స్వాగతించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు సామిక్ భట్టాచార్య మాత్రం కాంగ్రెస్, తృణమూల్ మధ్య సాధ్యమైన అవగాహనను తిరస్కరించారు. నందిగ్రామ్ ఉప ఎన్నిక ఫలితాలు అక్టోబర్ 6న జరగనున్న పోలింగ్ తర్వాత వెలువడనున్నాయి. ఈ ఉప ఎన్నికలో తాజా రాజకీయ సమీకరణాలు ఎలా ప్రభావం చూపుతాయన్నది తదుపరి కీలక అంశంగా మారింది.

# కోదాడ మెగా జాబ్ మేళా రాష్ట్రంలో మైలురాయి : స్పీకర్

భౌగోళిక దూరం, ఉద్యోగ సమాచార లోపం, ఆర్థిక పరిమితుల కారణంగా ప్రముఖ సంస్థలను చేరుకోలేకపోతున్న గ్రామీణ యువతకు స్థానికంగానే అవకాశాలు కల్పించాలన్న ఉద్దేశంతో ఈ మేళాను నిర్వహించారు. సూర్యాపేట, నల్లగొండ, యాదాద్రి భువనగిరి, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలకు చెందిన యువత ఈ మేళాలో పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సమాచార సాంకేతికత, ఫార్మా, తయారీ, వైద్య ఆరోగ్య రంగం, బ్యాంకింగ్, రిటైల్‌తోపాటు వివిధ రంగాలకు చెందిన సంస్థలు అభ్యర్థుల విద్యార్హతలు, నైపుణ్యాలను పరిశీలించి ప్రత్యక్ష ఇంటర్వ్యూలు నిర్వహించాయి. గ్రామీణ కుటుంబాలు ఎన్నో త్యాగాలు చేసి తమ పిల్లలను ఉన్నత చదువులు చదివిస్తున్నప్పటికీ, వారికి సరైన సమయంలో ఉద్యోగ సమాచారం అందడం లేదని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్, పాలిటెక్నిక్ తదితర కోర్సులు పూర్తి చేసిన యువత ఉద్యోగ అవకాశాలను గుర్తించడం, సంస్థలను సంప్రదించడం, ఇంటర్వ్యూల కోసం పదేపదే నగరాలకు వెళ్లడం వంటి ఇబ్బందులను ఎదుర్కొంటున్నారని వివరించారు. ఒక యువకుడి గ్రామ చిరునామా లేదా కుటుంబ ఆర్థిక పరిస్థితి అతని ఉద్యోగ అవకాశాలకు అడ్డంకిగా మారకూడదన్నదే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. అర్హులైన ఉద్యోగుల కోసం ఎదురుచూస్తున్న కంపెనీలు, తొలి అవకాశం కోసం నిరీక్షిస్తున్న గ్రామీణ యువతను ఒకే వేదికపైకి తీసుకురావడం ద్వారా వారి మధ్య ఉన్న అంతరాన్ని ఈ మేళా తగ్గించిందన్నారు. అభ్యర్థులు తమ విద్యార్హతలు, నైపుణ్యాలను నేరుగా సంస్థల ప్రతినిధుల ముందు ప్రదర్శించడంతోపాటు సంఘటిత రంగంలో ఉద్యోగాలు పొందేందుకు అవసరమైన అర్హతలు, నైపుణ్యాలపై అవగాహన పొందారని తెలిపారు. గత ఏడాది హుజూర్‌నగర్‌లో నిర్వహించిన జాబ్ మేళా అనుభవానికి కొనసాగింపుగా కోదాడలో ఈ కార్యక్రమాన్ని మరింత విస్తృత స్థాయిలో చేపట్టారు. పారిశ్రామికవేత్తలు, విద్యాసంస్థలు, ఐదు జిల్లాల అధికార యంత్రాంగంతో ముందస్తుగా సమన్వయం చేసుకుని యువతను పెద్ద ఎత్తున సమీకరించారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ ఈ కార్యక్రమానికి సహకారం అందించాయి. జాబ్ మేళాలో పాల్గొన్న యువతను ఉద్దేశించి శాసన సభాపతి గడ్డం ప్రసాద్‌కుమార్ మాట్లాడుతూ, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాలను చేరువ చేయడంలో కోదాడ మెగా జాబ్ మేళా రాష్ట్రంలో ఒక మైలురాయిగా నిలుస్తుందని ప్రశంసించారు. ఒకే వేదికపైకి సుమారు 350 కంపెనీలను తీసుకురావడం అసాధారణమైన ప్రయత్నమన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి భారీ ఉద్యోగ మేళాలను నిర్వహించి యువత నివసిస్తున్న ప్రాంతాలకు చేరువలోనే ఉపాధి అవకాశాలు కల్పించాలని సూచించారు. శాసనమండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఐటీ––పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, రోడ్లు––భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మావతిరెడ్డి, జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్ తదితరులు జాబ్ మేళాలో పాల్గొన్నారు. కంపెనీల ప్రతినిధులు, ఉద్యోగార్థులతో వారు మాట్లాడి, ఉద్యోగ అవకాశాలు పొందిన అభ్యర్థులను అభినందించారు.

# ట్రంప్‌నకు ఇరాన్ అల్టిమేటం

ఆయన మాట్లాడుతూ "ఏదైనా చర్చలు ప్రారంభించడానికి ఇరాన్ తన ఏడు షరతులను అమెరికా ప్రభుత్వానికి ప్రకటించింది. టెహ్రాన్ సందేశం స్పష్టంగా, నిస్సందేహంగా ఉంది. వాషింగ్టన్ తాను సృష్టించుకున్న చిక్కుముడి నుండి బయటపడాలనుకుంటే, అందులో మరింత చిక్కుకోకుండా ఉండాలంటే, ఇరాన్ హక్కులు, షరతులను అంగీకరించడం తప్ప దానికి మరో మార్గం లేదు," అని ఆయన ఆదివారం తెల్లవారుజామున శలో పోస్ట్ చేశారు.

**ఖతార్ ద్వారా అమెరికాకు సందేశం :** ఇరాన్, అమెరికా మధ్య నేరుగా కాకుండా మధ్యవర్తి దేశం ఖతార్ ద్వారా సంప్రదింపులు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఇరాన్ షరతులను ఖతార్ అమెరికాకు చేరవేసిందని, ప్రస్తుతం వాషింగ్టన్ నుంచి అధికారిక స్పందన కోసం వేచి చూస్తున్నామని ఆయన చెప్పారు. "ఈ షరతులను అంగీకరించడం అమెరికా ప్రయోజనానికే" అని వ్యాఖ్యానించారు. అదే సమయంలో అమెరికా నుంచి మరోసారి దాడి జరిగే అవకాశం ఉందని కూడా ఆయన హెచ్చరించారు.




# బహుళ ధ్రువ ప్రపంచం దిశగా..!

బహుళ ధ్రువప్రపంచం కోసం బ్రిక్స్ 18వ శిఖరాగ్ర మావేశం పిలుపునివ్వడం హర్షణీయం. అగ్రరాజ్యం అమెరికా ఏకపక్ష? ఆంక్ష?లు, యుద్ధాలతో నష్టపోతున్న ప్రపంచానికి ఊరట. సమావేశాల ముందురోజునే 'స్థిరత్వం, నవకల్పన, సహకారం, సుస్థిరత' లక్ష్యంగా ఢిల్లీ డిక్లరేషన్‌ను రూపొందించడం, సభ్యదేశాలన్నీ ఏకగ్రీవంగా ఆమోదించడం శుభపరిణామం. న్యూఢిల్లీ వేదికగా సాగిన ఈ సమావేశం ఏకధ్రువ ప్రపంచాన్నీ, డాలర్ ఆధిపత్యాన్నీ సవాల్ చేయడం ప్రత్యేక ప్రాధాన్యతను సంతరించుకుంది. ఇంతకాలం అమెరికా, ఇజ్రాయిల్ అడుగులకు మడుగులొత్తి, ఏకపక్ష? సుంకాలు, బెదిరింపులపై కనీసం నోరుమెదపని మోడీ ప్రభుత్వం... తాజా డిక్లరేషన్‌లో వాటి పేరెత్తకుండానైనా వాటి చర్యలను ఖండించింది. బహుపాక్ష?కవాదం (మల్టీలేటరిలిజమ్) ప్రాముఖ్యతను ఈ సమావే శాలు ముందుకు తేవడం మారుతున్న ప్రపంచ పరిస్థితులకు అద్దం పడుతోంది. 2009లో భారత్, చైనా, రష్యా, బ్రెజిల్ దేశాలతో ప్రారంభమైన బ్రిక్స్‌లో ఆ తరువాత దక్ష?ణాఫ్రికా చేరింది. ప్రస్తుతం పదకొండు దేశాలతో, ప్రపంచంలో దాదాపు యాభై శాతం జనాభాతో, నలభై శాతం జీడీపీతో ఉన్న ఈ కూటమి ఐక్యత అత్యవసరం. సోవియట్ యూనియన్ పతనా నంతరం ప్రపంచంపై ఏకపక్ష? ఆధిపత్యానికి తెగబడు తున్న అమెరికా దురాక్రమణ వాద, దుశ్చర్యలను అడ్డుకునేందుకు ప్రజాస్వామ్య యుతమైన, విస్తృత భాగస్వామ్యం కలిగిన అంతర్జాతీయ కూటమి అత్యవసరం. ఏకధ్రువ ప్రపంచానికి బదులుగా మరింత ప్రజాస్వామ్యయుతమైన ప్రపంచ వ్యవస్థ ఉండాలని ఈ సమావేశం పిలుపునివ్వడం సముచితం. ఐక్యరాజ్య సమితి, ప్రపంచ ఆర్థిక వ్యవస్థలు ప్రపంచ ప్రజల అభిప్రాయాలను, ప్రయోజనాలను ప్రతిబింబించేలా వ్యవహరించాలన్న సభ్యదేశాల డిమాండ్ వాటి వైఖరులను సరిచేసుకోవాలన్న హెచ్చరిక. అమెరికా ఏకపక్ష? ఆంక్ష?లను, సుంకాలను ఖండిం చడం అగ్రరాజ్యానికి మింగుడుపడనిదే. బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్యాన్ని మెరుగుపరచాలని, స్థానిక కరెన్సీలలో మరింత ఎక్కువ లావాదేవీలు జరపాలని చేసిన తీర్మానం ప్రత్యామ్నాయ కరెన్సీకి ఊపునివ్వడంతోపాటు డాలర్ గట్టి సవాల్‌ను విసిరేదే! మనదేశంలో పహల్గామ్‌లో దాడి సహా ఏ దేశంలోనూ ఉగ్రదాడులను సహించబోమన్న తీర్మానం సరైనది. ఏ సభ్య దేశం పేరు, అమెరికా పేరు ప్రస్తావించకపోయినా ఈ డిక్లరేషన్ అగ్రరాజ్య ఆధిపత్యాన్ని గట్టిగానే ప్రశ్నిం చింది. సాంకేతిక పరిజ్ఞానాన్ని, వనరులను ఆయుధాలుగా మలిచే అమెరికా తీరును ఈసడించింది. గాజాలో ఇజ్రాయిల్ దాడులను తీవ్రంగా ఖండించడం, 1967 నాటి సరిహద్దుల ఆధారంగా తూర్పు జెరూసలేం రాజధానిగా స్వేచ్ఛాయుతమైన స్థిరమైన, సార్వభౌమాధికారం కలిగిన పాలస్తీనా దేశాన్ని ఏర్పాటు చేయాలని పిలుపునివ్వడం ముదావహం. ఆయుధాల విచ్చలవిడి వినియోగానికి స్వస్తి పలకాలని, సాయుధ ఘర్షణల సమయంలో అణుభద్రతకూ ప్రాధాన్యత ఇవ్వాలని ఢిల్లీ డిక్లరేషన్ నొక్కి వక్కాణించింది. భారత్, బ్రెజిల్‌లకు స్థానం కల్పిస్తూ ఐక్యరాజ్య సమితి భద్రతా మండలిని విస్తరించాలన్న తీర్మానం ఏండ్ల తరబడి మనదేశం చేస్తున్న ప్రయత్నాలకు ఊతమిచ్చేదే. 15 దేశాల అధినేతలతో ప్రధాని ద్వైపాక్ష?క చర్చలు జరిపి, సంబంధాల బలోపేతానికి ప్రయత్నించడం సరైనదే. ఇరాన్ సుప్రీం నేతసహా అత్యున్నత నాయకత్వాన్ని ఏకపక్ష?ంగా అమెరికా, ఇజ్రాయిల్ అంతమొందించి నప్పుడు సంతాపం తెలియజేయడానికి మీనమేషాలు లెక్కించిన మోడీ ఇరాన్‌ను శాంతింపజేయడానికా అన్నట్టు ఆ దేశ అధ్యక్ష?ుడికి ప్రాధాన్యత ఇవ్వడం కొంత మెరుగు. అతిథుల ఆహారపు అలవాట్లకు గానీ, భిన్నత్వంలో ఏకత్వాన్ని చూపే భారతీయ ప్రత్యేకతలకు గానీ చోటులేకుండా శాకాహారానికే బ్రిక్స్ దేశాల అతిథుల విందును పరిమితం చేయడంతో ఢిల్లీ పెద్దల కురచబుద్ధి మరోసారి వెల్లడయింది. ఇరుదేశాల మధ్య ఉన్న అంతరాలను, సరిహద్దు విభేదాలను సాధారణీకరించు కోవాలన్న సంకల్పం మోడీ, జిన్‌పింగ్‌లలో కనిపించడం భారత్, చైనాలకు ప్రయోజనకరం. బహుళ ధ్రువ ప్రపంచానికి చోదక శక్తిగా వర్ధిస్తూ ఓపెన్ సోర్స్ ఏఐ కోసం జిన్‌పింగ్ చేసిన ప్రతిపాదన, కొత్త బీమా యంత్రాంగం కోసం పుతిన్ చేసిన సూచన ఆచరణలోకి రావడం అవసరం. బ్రిక్స్ ప్రారంభం నుంచీ స్పష్టమైన విధానాలు పెద్దగా రాని వేదిక నుంచి న్యూఢిల్లీలో భారత్ అధ్యక్ష?తన నాలుగోసారి సాగిన డిక్లరేషన్ గ్లోబల్ సౌత్ ప్రతిష్టను పెంచడం ప్రశంసనీయం. బిక్స్ దేశాల ఐక్యత బహుళ ధ్రువ ప్రపంచానికి ఆశాకిరణం.

# బ్రెయిన్ ట్యూమర్ బాధితుడికి ఆర్థిక సహాయం



**ఖానాపూర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్న పాల మల్లేష్ చికిత్స కోసం రూ. 2.50 లక్షల ఎల్‌ఓసీ మంజూరు చేసినట్లు డీసీసీ ఉపాధ్యక్షుడు చిన్నం సత్యం తెలిపారు. ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ ఆదేశాల మేరకు ఈ సహాయం అందించారని చెప్పారు. మల్లేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, సహకరించిన ఎమ్మెల్యేకు కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు నిమ్మల రమేష్, గుమ్ముల అశోక్, ఆత్మ కమిటీ చైర్మన్ తోట సత్యం, మాజీ కౌన్సిలర్ అమానుల్లా ఖాన్, కస్తూరి మహేందర్, శ్రీపాద శేషాద్రి, లక్ష్మీపతి గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ మొరం రవాణా ట్రాక్టర్ పట్టివేత



**ఖానాపూర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పట్టణంలో శనివారం రాత్రి అక్రమంగా మొరం తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. అనుమతులు లేకుండా రవాణా చేస్తున్నట్లు గుర్తించి ట్రాక్టర్‌ను అదుపులోకి తీసుకున్నామని ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ తెలిపారు. పట్టుబడిన ట్రాక్టర్‌ను తదుపరి చర్యల కోసం రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు ఆయన పేర్కొన్నారు.

# ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్



**ఖానాపూర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ఎస్సీ, ఎస్టీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకటరావు డిమాండ్ చేశారు. ఆరు నెలలకు ఒకసారి చెల్లించాల్సిన డీఏలు ఏకంగా ఆరు పెండింగ్‌లో ఉండటం అన్యాయమని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. అలాగే పీఆర్‌సీ నివేదికను ఆలస్యం చేయడం వల్ల ఉద్యోగులు ఆర్థికంగా నష్టపోతున్నారని, ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల్లోనే పీఆర్‌సీని అమలు చేయాలని స్పష్టం చేశారు. సీపీఎస్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఏకమై పోరాటాలు తీవ్రతరం చేస్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భూక్యా రాజేష్ నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, కోశాధికారి రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

# జడ్పీహెచ్ఎస్ విద్యా విధానం ఆదర్శం




**ఖానాపూర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** మస్కాపూర్ పీఎం శ్రీ జడ్పీహెచ్ఎస్ విద్యా విధానం రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జాదవ్ వెంకట్రావు అన్నారు. విద్యార్థుల అభివృద్ధికి ప్రత్యేక తరగతులు నిర్వహిస్తూ కృషి చేస్తున్న ప్రధానోపాధ్యాయుడు జాడి శ్రీనివాస్‌ను ఘనంగా సన్మానించారు. ప్రతి ఏటా విద్యార్థులు జాతీయ స్థాయి ఉపకార వేతనాలు సాధిస్తున్నారని, ప్రస్తుతం 850 మంది విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుతున్నదని ఆయన పేర్కొన్నారు. అయితే విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల కొరత ఉందని, అదనపు ఉపాధ్యాయులను వెంటనే నియమించాలని ప్రభుత్వం, జిల్లా కలెక్టర్‌ను డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు భూక్య రాజేశ్ నాయక్, ప్రధాన కార్యదర్శి క్రాంతికుమార్, జిల్లా నాయకులు వెన్నం అంజయ్య, రవికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గణపతి మండపాల పరిశీలన



**ఖానాపూర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్ శనివారం రాత్రి ఖానాపూర్ పట్టణంలోని పలు గణపతి మండపాలను సందర్శించారు. ఉత్సవ కమిటీ సభ్యులతో మాట్లాడి గణేశ్ ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులకు సహకరించాలని ఆయన కోరారు. ఈ సందర్భనలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి శ్యామ్, సీఐ కట్కం సత్యనారాయణ, ఎస్ఐ రాహుల్ గైక్వాడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎస్టీయూ 80 ఏళ్ల ఉద్యమ ప్రస్థానం



**ఖానాపూర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఉపాధ్యాయ హక్కుల సాధనలో, విద్యారంగ సంక్షేమం కోసం ఎస్టీయూ ఎనిమిది దశాబ్దాలుగా నిరంతర పోరాటం చేస్తూ రాష్ట్రానికి ఆదర్శంగా నిలుస్తోందని జిల్లా అధ్యక్షుడు భూమన్న యాదవ్ తెలిపారు. నిజాం నిరంకుశ పాలనలో ఉపాధ్యాయుల హక్కుల కోసం ప్రారంభమైన ఈ ఉద్యమం 1947లో ప్రభుత్వ గుర్తింపు పొందింది. అప్పటి నుండి ఉపాధ్యాయుల వేతన సవరణలు, సేవా నిబంధనలు, విద్యా రంగ పరిరక్షణ కోసం ఎస్టీయూ కీలక పాత్ర పోషించింది. విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యంగా ప్రభుత్వ బడులను కాపాడుతూ, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి ఎస్టీయూ ఎల్లప్పుడూ ముందుండి పోరాడిందని ఆయన పేర్కొన్నారు. తెలంగాణ ఉద్యమంలోనూ, కోవిడ్ సమయంలోనూ ఉపాధ్యాయులు, పేదల కోసం సేవలు అందించిన సంఘం సామాజిక బాధ్యతను కూడా నిర్వర్తించిందని తెలిపారు. 80 ఏళ్ల ప్రస్థానం పూర్తి చేసుకున్న ఎస్టీయూ త్వరలో శతవసంతాల వేడుకలకు అడుగులు వేస్తుందని, ఉపాధ్యాయులందరూ సంఘ సేవలో గర్వంగా భాగస్వాములు కావాలని భూమన్న యాదవ్ పిలుపునిచ్చారు.

# హృదయాన్ని కదిలించేది కవిత్వం

**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** వ్యక్తులను, సమాజాన్ని మార్చేది హృదయాన్ని కదిలించేది కవిత్వమని ప్రముఖ సామాజికవేత్త, తెలంగాణ బీసీ కమిషన్ తొలి చైర్మన్ బి.ఎస్. రాములు అన్నారు. హైదరాబాద్‌లోని సుందరయ్య భవన్‌లో భవానీ సాహిత్య వేదిక, అక్షర కుసుమాలు సంయుక్తంగా నిర్వహించిన పుస్తకావిష్కరణ సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని వైరాగ్యం ప్రభాకర్ సంపాదకత్వంలో వెలువడిన యుద్ధం మొదలైంది కవితా సంకలనం, హృదయ పీఠిక పుస్తకాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాములు మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం యువత భవిష్యత్తును నాశనం చేస్తోందని, వాటి దుష్ప్రభావాలను ప్రతిబింబించేలా కవితలు రచించబడ్డాయని తెలిపారు. కవిత్వం ఆనందాన్ని కలిగించడమే కాకుండా ఆలోచనలకు దారితీయాలని, అప్పుడే సమాజంలో మార్పు సాధ్యమని ఇతర అతిథులు పేర్కొన్నారు. కార్యక్రమంలో వనజా



బలసాని సమీక్ష, సాదనాల వెంకటస్వామి నాయుడు, బైస దేవదాసు, డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్‌రాజు, సిహెచ్. మల్లయ్యాచారి, నాగశ్రీ బలధారి, తూము నరసయ్య, మహ్మద్ ఖాలీద్, వేము వందనం, డాక్టర్ షహనాజ్ బతుల్, అనిత రాణి, దొమ్మాట శ్రీకాంత్ గౌడ్, కప్పల అజయ్, రఘువుద్దీన్, కొండముది పద్మజ, ఈ. నవనీతరావు, ఏరువ వెంకటేశం, కేశరాజు వెంకట ప్రభాకర్‌రావు, న్యాలకంటి నారాయణ, జి. కుమార్‌రాజు తదితరులు పాల్గొన్నారు.




# సేవాభావంతో ముందుకు సాగుతున్న బైరి రవి



**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కొడిమ్యాల మండలానికి చెందిన బైరి రవి గత 20 ఏళ్లుగా సింగపూర్‌లో నివసిస్తూ ప్రవాస తెలంగాణ యువతకు అండగా నిలుస్తున్నారు. యువతను చెడు మార్గాల్లోకి వెళ్లకుండా ప్రోత్సహిస్తూ, రక్తదాన శిబిరాలు, సాంస్కృతిక కార్యక్రమాలు, బతుకమ్మ వేడుకలు నిర్వహిస్తూ ప్రత్యేక గుర్తింపు పొందారు. తాజాగా తెలంగాణ శ్రీనివాసుల సేవా సంస్థ పిలుపునకు స్పందించి యువతతో కలిసి రక్తదాన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్య కారణాల వల్ల ఆ రోజు రక్తదానం చేయలేకపోయినా, అనంతరం స్వయంగా రక్తదానం చేసి సింగపూర్‌లో 17వసారి రక్తదానం చేసిన ఘనత సాధించారు. సంస్థ వ్యవస్థాపక చైర్మన్ పూట్కూరి శ్రీనివాస్‌రెడ్డి బైరి రవిని అభినందిస్తూ, ఆయన సేవాభావం యువతకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. బైరి రవి వంటి వ్యక్తులు సమాజానికి ఆదర్శమని అన్నారు.

# నాసిరకం రిక్షాలపై టీఆర్ఎస్ ఆగ్రహం



**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** చెత్త సేకరణ కోసం కార్మికులకు పంపిణీ చేసిన రిక్షాలు నాణ్యతలేమితో సమస్యలు తలెత్తాయని తెలంగాణ రక్షణ సేన జిల్లా అధ్యక్షుడు గుంజపడుగు హరిప్రసాద్ ఆరోపించారు. పంపిణీకి ముందే టైర్లు, ట్యూబులు, తాళాలు, చైన్లు లేకపోవడంతో కార్మికులు తమ స్వంత డబ్బులతో రిపేర్ చేయించుకోవాల్సి వచ్చిందని ఆయన తెలిపారు. ప్రజాధనంతో కొనుగోలు చేసిన రిక్షాలను కార్మికుల జేబుల నుంచి మరమ్మతు ఖర్చులు వసూలు చేయడం అవినీతికి నిదర్శనమని అన్నారు. నాణ్యతలేని రిక్షాల కొనుగోళ్లపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నాణ్యమైన రిక్షాలు అందించడం నగర పాలక సంస్థ బాధ్యత అని, ప్రజాధన దోపిడీని సహించబోమని హెచ్చరించారు.

# పీఆర్టీయూ మండల శాఖ నూతన కమిటీ ఏర్పాటు



**హుస్నాబాద్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పీఆర్టీయూ హుస్నాబాద్ మండల శాఖ ఎన్నికల్లో పంజా రాజమల్లు అధ్యక్షుడిగా, ప్రతాప్ రాజయ్య ప్రధాన కార్యదర్శిగా ఎన్నుకోబడ్డారు. అసోసియేట్ అధ్యక్షులుగా కొలిపాక వెంకటమల్లు, రజిత, ఉపాధ్యక్షులుగా పిడిశెట్టి వెంకన్న, లత, కార్యదర్శులుగా మహమ్మద్ ఆసిఫ్ ఇక్బాల్, ఇస్లావత్ తిరుపతి, మహిళా కార్యదర్శులుగా రమాదేవి, జి. రమాదేవి ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఎన్నికలపై రాష్ట్ర అధ్యక్షుడు పుల్గం దామోదర్ రెడ్డి, రాష్ట్ర ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి, జిల్లా నాయకులు ఇంద్రసేనారెడ్డి, శశిధర శర్మ అభినందనలు తెలిపారు. ఎన్నికల ప్రక్రియలో సుమారు 150 మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరా అంతరాయం

**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** లైన్ పనులు, చెట్ల కొమ్మలు తొలగింపు కారణంగా నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడనుంది. రేకుర్తి 11 కెవి ఫీడర్‌లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు సరఫరా నిలిచిపోతుంది. ప్రభావిత ప్రాంతాలు: సలేహ్‌నగర్, పాతవాడ, కొత్తవాడ, హరిహరనగర్, శాతావాహన కాలనీ, హనుమాన్‌నగర్. వినియోగదారులు సహకరించాలని ఏడీఈ గడం రఘు కోరారు. అలాగే ఐబి ఫీడర్, సంతోష్‌నగర్ ఫీడర్‌లలో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు విద్యుత్ అంతరాయం ఉంటుంది. ప్రభావిత ప్రాంతాలు: సర్కస్ గ్రౌండ్, పద్మనాయక కల్యాణమండపం, జ్యోతినగర్, గీతాభవన్ వెనుక వైపు, కార్పెంటర్ సొసైటీ. వినియోగదారులు సహకరించాలని ఏడీఈ ఎం.లావణ్య తెలిపారు.

## పూర్వ విద్యార్థుల చేత ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**ఖానాపూర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా ఖానాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల 2010--11 పదవ తరగతి పూర్వ విద్యార్థులు తమ గురువు గౌస్ మొహియుద్దీన్‌ను ఘనంగా సన్మానించారు.నిర్మల్ ప్రభుత్వ బాలికల పాఠశాల ఉర్దూ మీడియం ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న ఆయన జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా పూర్వ విద్యార్థులు ఆయన నివాసంలో పూలమాలలు వేసి, శాలువా కప్పి శుభాకాంక్షలు తెలిపారు.విద్యా రంగంలో ఆయన దీర్ఘకాల సేవలు అందించడం తమకు గర్వకారణమని, భవిష్యత్తులో కూడా అదే అంకితభావంతో విద్యార్థులకు మార్గదర్శకత్వం వహించాలని వారు ఆకాంక్షించారు.కార్యక్రమంలో పర్వేజ్, సల్మాన్ ఖాన్, అతీక్, అబిద్, ఇజాజ్, మిన్హాజ్ తదితరులు పాల్గొన్నారు.

## వర్ష ప్రభావిత ప్రాంతాల్లో మేయర్, డిప్యూటీ మేయర్ పర్యటన



**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ నగరంలో ఆదివారం కురిసిన వర్షాల కారణంగా ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రాంతాలను మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్‌రావు సంయుక్తంగా పర్యటించారు.52, 53, 59, 60, 64వ డివిజన్లు, సాయినగర్, కాశ్మీర్‌గడ్డ, ముకరంపుర, జ్యోతినగర్ తదితర ప్రాంతాల్లో వర్షపు నీరు నిలిచిన చోట్ల తక్షణ సహాయ చర్యలు చేపట్టినట్లు తెలిపారు. రాబోయే వర్షాకాలానికి శాశ్వత పరిష్కార చర్యలు తీసుకునే ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు.డిఆర్ఎఫ్ బృందాలు, మున్సిపల్ సిబ్బంది, శానిటరీ కార్మికులు, జవాన్లు కలిసి నీరు నిల్వ కాకుండా చర్యలు చేపట్టారు.ఈ పర్యటనలో కార్పొరేటర్లు బోయినపల్లి ప్రవీణ్‌రావు, కొంపెల్లి శ్వేత-రామన్, మాజిద్ హుస్సేన్, ఇబ్రహీం, పడాల శ్రీజ-అజయ్, బీజేపీ నాయకులు కటకం లోకేష్ కుమార్, అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి



**కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ రూరల్ మండలంలోని ఎస్ హెచ్-1 ప్రధాన రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్ధంపూర్ గ్రామానికి చెందిన దాడి శారద (50) మృతి చెందింది. ఉదయం 11.20 గంటల సమయంలో బ్రీజా కారు అతివేగంగా వచ్చి శారద, కనుకమ్మలను ఢీకొట్టింది. ఇద్దరికీ తీవ్ర గాయాలు కాగా, ఆసుపత్రికి తరలించగా శారద చికిత్స పొందుతూ మృతి చెందింది.మృతురాలి కుమారుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, శవానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు. ప్రమాదానికి కారణమైన కారు డ్రైవర్ పరారీలో ఉన్నాడని, ఘటనపై విచారణ కొనసాగుతున్నట్లు ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి తెలిపారు.

## అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్ల పట్టివేత



**కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** దుర్శెడ్ గ్రామం వద్ద అక్రమంగా ఇసుక తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను రూరల్ పోలీసులు ఆదివారం ఉదయం పట్టుకున్నారు.గాజుల శివకృష్ణ, తోట వినయ్, శ్రీరామోజు తిరుపతి అనే ముగ్గురు ఇరుకుళ్ల వాగు నుంచి అనుమతులు లేకుండా ఇసుకను తవ్వి తరలిస్తున్నట్లు విచారణలో వెల్లడైంది. పోలీసులు పంచసాక్షుల సమక్షంలో వాంగ్మూలాలు నమోదు చేసి, ట్రాక్టర్లు, ట్రైలర్లను ఇసుకతో సహా స్వాధీనం చేసుకున్నారు. నిందితులను స్టేషన్‌కు తరలించి కేసులు నమోదు చేశారు. అక్రమ ఇసుక తవ్వకాలు, రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రూరల్ ఇన్‌స్పెక్టర్ ఏ. నిరంజన్ రెడ్డి హెచ్చరించారు.

## జాతీయ వార్‌రూమ్ బాధ్యతలు స్వీకరించిన రుద్ర సంతోష్ కుమార్



**హైదరాబాద్/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** తెలంగాణలో కులగణన కార్యక్రమాన్ని బూత్ స్థాయి వరకు సమన్వయం చేసిన అనుభవానికి గుర్తింపుగా రుద్ర సంతోష్ కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో కీలక బాధ్యతలకు నియమించింది.దేశవ్యాప్తంగా కులగణనపై 100 రోజుల క్యాంపెయిన్‌కు ఏఐసీసీ వార్‌రూమ్ కోఆర్డినేటర్‌గా ఆయన నియామక పత్రం జారీ చేసినట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. రాష్ట్రాల వారీ కార్యాచరణ, శిక్షణ, డిజిటల్ మానిటరింగ్, వారపు నివేదికలు వంటి అంశాలను సమన్వయం చేయనున్నట్లు తెలిపారు.తెలంగాణలో 2024--25లో నిర్వహించిన కులగణనలో ఆయన ఆధ్వర్యంలో ప్రత్యేక వార్‌రూమ్, కాల్‌సెంటర్ వ్యవస్థల ద్వారా 35,000 మంది బూత్ స్థాయి కార్యకర్తలతో సమన్వయం చేసిన అనుభవం జాతీయ స్థాయిలో ఉపయోగించనున్నట్లు పార్టీ వర్గాలు పేర్కొన్నాయి.ఇటీవల ఢిల్లీలో జరిగిన జాతీయ ఓబీసీ వర్క్‌షాప్‌లో ఆయన 45 నిమిషాల పాటు కార్యాచరణ ప్రణాళికను ప్రెజెంట్ చేసి రాష్ట్రాల వారీగా అమలు చేయాల్సిన విధానాన్ని వివరించారు.100 రోజుల క్యాంపెయిన్‌ను 15 వారాల పాటు దశలవారీగా అమలు చేస్తూ రాష్ట్రాల నుంచి జిల్లా, మండల, గ్రామ స్థాయి వరకు సమన్వయ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నట్లు పార్టీ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ వార్‌రూమ్ నుంచి ఢిల్లీ జాతీయ వార్‌రూమ్ వరకు రుద్ర సంతోష్ కుమార్ బాధ్యతలు విస్తరించడం కాంగ్రెస్ పార్టీ కులగణన కార్యక్రమానికి ఇచ్చే ప్రాధాన్యతను ప్రతిబింబిస్తోందని పేర్కొన్నారు.

## ప్రజా సమస్యలపై బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు





**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావుతో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు.చెత్త సేకరణ కోసం ప్రతి డివిజన్‌కు ట్రైసైకిళ్లు, కొత్త ఫాగ్ మిషన్లు, ట్రాక్టర్లు అందుబాటులోకి తెస్తున్నామని తెలిపారు. డంపింగ్ యార్డ్ సమస్య పరిష్కారానికి రూ.17 కోట్లతో బయోమైనింగ్ పనులు, రూ.80 కోట్లతో సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, రూ.16 కోట్లతో ఫ్రెష్ వేస్ట్ మేనేజ్‌మెంట్ పనులు ప్రారంభించనున్నట్లు వెల్లడించారు.22ఏ సమస్యను గత పాలకులు తమకు అనుకూలంగా వాడుకున్నారని, దీనిని పరిష్కరించకపోతే న్యాయపరమైన పోరాటం చేస్తామని హెచ్చరించారు. గణేశ్ నవరాత్రి నిమజ్జన ఉత్సవాలను ఈసారి మరింత ఘనంగా నిర్వహించనున్నామని, మహిళల భాగస్వామ్యం పెరగడం హర్షణీయమని అన్నారు. ప్రజలు భక్తియుత వాతావరణంలో ఉత్సవాలు జరపాలని, పోలీసులకు సహకరించాలని కోరారు.ఖైరతాబాద్ ఉప ఎన్నికల్లో పోటీ బీజేపీ, బీఆర్ఎస్ మధ్యనే ఉంటుందని, కాంగ్రెస్ ప్రజల్లో అసహ్యం కలిగిస్తోందని విమర్శించారు. దానం నాగేందర్ వ్యాఖ్యలను ఎద్దేవా చేస్తూ, కాంగ్రెస్‌ను రాజకీయంగా నిమజ్జనం చేయడం తథ్యమని అన్నారు.

## గణేశ్ నిమజ్జన ఏర్పాట్లపై బండి సంజయ్ సమీక్ష సమావేశం









**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గణేశ్ నవరాత్రి నిమజ్జన ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు కరీంనగర్‌లో విస్తృత ఏర్పాట్లు చేస్తున్నామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు.మున్సిపల్ కార్యాలయంలో మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్‌రావు, పోలీసు అధికారులతో సమావేశమై నిమజ్జన రోజున తీసుకోవాల్సిన జాగ్రత్తలు, భక్తులకు అందించాల్సిన సౌకర్యాలపై సూచనలు చేశారు. "ప్రశాంతతకు ప్రతీక కరీంనగర్. ఈసారి ఉత్సవాలను అత్యంత శోభాయమానంగా జరుపుతాం. పోలీసులు ఓర్పుతో వ్యవహరించి భక్తులకు సహకరించాలి" అని విజ్ఞప్తి చేశారు.మహిళల భాగస్వామ్యం పెరగడం హర్షణీయమని, తప్పుడు ప్రచారాలను నమ్మొద్దని ప్రజలకు సూచించారు. అవసరమైతే మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లను సంప్రదించాలని తెలిపారు.తరువాత ఆయన రేకుర్తిలో బీజేపీ ఆధ్వర్యంలో జరిగిన రక్తదాన శిబిరాన్ని సందర్శించి స్వచ్ఛంద రక్తదాతలను అభినందించారు. ప్రధాని మోదీ పాలనలో దేశం అభివృద్ధి సాధించిందని, పేదరికం నుంచి కోట్లాది ప్రజలు బయటపడ్డారని అన్నారు. కమాన్ సర్కిల్‌లో ఆధార్ సెంటర్‌ను ప్రారంభించిన బండి సంజయ్, ప్రతి ఒక్కరూ ఆధార్ తప్పనిసరిగా చేయించుకోవాలని, ముఖ్యంగా 5--15 ఏళ్ల పిల్లలు బయోమెట్రిక్ పూర్తి చేయాలని సూచించారు.వర్షాన్ని లెక్కచేయకుండా పలు గణేశ్ మండపాలను సందర్శించి భక్తులతో ముచ్చటించిన ఆయన, ఉత్సవాలను భక్తియుత వాతావరణంలో జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

## నాగర్‌కర్నూల్‌ను కరువు జిల్లాగా ప్రకటించాలి

### ఎండిన పంటలకు ఎకరాకు రూ.40 వేల పరిహారం ఇవ్వాలి: సీపీఎం



**కల్వకుర్తి, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో నాగర్‌కర్నూల్‌ను కరువు జిల్లాగా ప్రకటించి, ఎండిపోయిన పంటలకు ఎకరాకు రూ.40 వేల చొప్పున పరిహారం అందించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్ధన్ పర్వతాలు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన సీపీఎం రెవెన్యూ డివిజన్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు.జిల్లాలో తక్కువ వర్షపాతం కారణంగా పత్తి, మొక్కజొన్న, కంది, జొన్న తదితర పంటలు ఎండిపోయాయని తెలిపారు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్ల కింద పంటల పరిస్థితి కూడా దయనీయంగా ఉందన్నారు. విద్యుత్ సరఫరా సక్రమంగా లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం క్షేత్రస్థాయిలో పంట నష్టాన్ని అంచనా వేసి పరిహారం అందించాలని కోరారు. కరువు సహాయక చర్యలకు రూ.1,000 కోట్లు కేటాయించి, పెండింగ్ ప్రాజెక్టులను పూర్తిచేసి సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకపోతే రైతులతో కలిసి ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో చింత ఆంజనేయులు, బి.ఆంజనేయులు, ఏపీ మల్లయ్య, పరశు రాములు, బాలస్వామి, తారాసింగ్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్‌నగర్‌లో అట్టహాసంగా భగవతి పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన



**కరీంనగర్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** భగత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన గణేష్ మండపం వద్ద భగవతి పాఠశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శన ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నగర డిప్యూటీ మేయర్, మాజీ మేయర్ యాదగిరి సునీల్‌రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. విద్యార్థులు ప్రతీ సంవత్సరం గణపతి నవరాత్రుల సందర్భంగా నాట్య ప్రదర్శనలు ఇవ్వడం ఆనవాయితీగా వస్తోందని, ఈసారి కూడా అద్భుతంగా ప్రదర్శన ఇచ్చారని ఆయన అభినందించారు. ఉపాధ్యాయులు, పాఠశాల యాజమాన్యం, సిబ్బందికి ధన్యవాదాలు తెలుపుతూ విద్యార్థులకు చిరు కానుకలు అందజేశారు.కార్యక్రమంలో భగత్‌నగర్ కాలనీ వాసులు, పెద్దలు, భగవతి పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## కౌన్సిలర్ అస్లం పర్వేజ్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం నిర్వహణ



**పెద్దపల్లి, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** గణపతి భక్తుల కోసం 14వ వార్డులో కౌన్సిలర్ అస్లం పర్వేజ్ ఆధ్వర్యంలో ఘనంగా అన్నదాన కార్యక్రమం జరిగింది.భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా వంటల తయారీ నుంచి భోజనం వడ్డించే వరకు స్వయంగా పర్యవేక్షించారు. కార్యక్రమం ప్రశాంతంగా సాగింది.వార్డు ప్రజలు, భక్తులు మాట్లాడుతూ అస్లం పర్వేజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అన్నదానం మతసామరస్యానికి ప్రతీకగా నిలిచిందని, 'హిందూ--ముస్లిం భాయీ భాయీ' స్ఫూర్తితో తెలంగాణ గంగా--జమునా తెహజీబ్ సంస్కృతిని ప్రతిబింబించిందని అభినందించారు.

## నేడు కోర్టుకు హాజరు కానున్న మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి



**కల్వకుర్తి, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి నేడు ఉదయం 11 గంటలకు కల్వకుర్తి కోర్టుకు హాజరుకానున్నట్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుస్తకాల రాహుల్ తెలిపారు. కల్వకుర్తి రెవెన్యూ డివిజన్ సాధన ఉద్యమ సమయంలో అప్పటి బీఆర్ఎస్ ప్రభుత్వం నమోదు చేసిన కేసులో ఆయన కోర్టుకు హాజరవుతున్నట్లు వెల్లడించారు.

## అక్రమ కలప తరలింపుపై విజిలెన్స్ కొరడా

### ట్రాక్టర్ సీజ్.. అజ్జలాపురం శివారులో దాడులు



**మర్రిగూడ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని అజ్జ లాపురం గ్రామ శివారులో శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయ పరిసరాల్లో అక్రమంగా కలప తరలిస్తున్నారన్న సమాచారంతో విజిలెన్స్ అధికారులు దాడులు నిర్వహించారు. రాత్రివేళల్లో గుర్తుతెలియని వ్యక్తులు అడవిలో విలువైన కలపను నరికి తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో విజిలెన్స్ డీఆర్వో శశిధర్‌రావు ఆధ్వర్యంలో అటవీశాఖ అధికారులు తనిఖీలు చేపట్టారు.ఈ సందర్భంగా కలప తరలిస్తున్న వ్యక్తులను పట్టుకుని, ట్రాక్టర్‌ను సీజ్ చేసి మర్రిగూడ పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఘటనపై తదుపరి విచారణ కొనసాగుతున్నట్లు తెలిసింది.

# ఆపదలో సీఎంఆర్ఎఫ్ అండ

పేద కుటుంబానికి రూ.44 వేల సాయం : గోలి శ్రీనివాస్ రెడ్డి



**ఆమనగల్లు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ఆపదలో ఉన్న పేద కుటుంబాలకు సీఎంఆర్ఎఫ్ ఆర్థిక భరోసా కల్పిస్తోందని తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. మాడ్గుల మండలం ఫిరోజ్‌నగర్ గ్రామానికి చెందిన కలకొండ జ్యోతి కుటుంబానికి సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా మంజూరైన రూ.44 వేల చెక్కును ఆదివారం హైదరాబాద్‌లో కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా గోలి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ.. పేదల ఆరోగ్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని సీఎంఆర్ఎఫ్ ద్వారా ప్రభుత్వం ఆర్థిక సహాయం అందిస్తోందన్నారు. అనారోగ్యంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్న కుటుంబాలకు ఈ సాయం ఆర్థికంగా కొంత ఊరటనిస్తుందని పేర్కొన్నారు. అత్యవసర వైద్య ఖర్చుల సమయంలో సీఎంఆర్ఎఫ్ ద్వారా అందుతున్న సహాయం పేదలకు ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు జైపాల్ రెడ్డి, సర్పంచ్ కలకొండ జంగమ్మ శ్రీను, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సురమళ్ల సుభాష్, నాయకులు సతీష్, సీత మహేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# గణపయ్య ఆశీస్సులతో సుఖసంతోషాలు వెల్లివిరియాలి

వెంకటగిరి కాలనీలో గంప వెంకటేష్ గుప్తా ప్రత్యేక పూజలు



**ఆమనగల్లు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గణనాథుడి కృపాకటాక్షాలతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని సింగిల్ విండో చైర్మన్ గంప వెంకటేష్ గుప్తా ఆకాంక్షించారు. ఆమనగల్లు పట్టణంలోని వెంకటగిరి కాలనీలో విష్ణు వినాయక ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపంలో శనివారం రాత్రి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని గణపయ్యకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో స్వామివారిని కొలిచి, ప్రజలంతా ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో జీవించాలని ప్రార్థించారు. వినాయకుడి ఆశీస్సులు ప్రతి కుటుంబంపై ఉండాలని ఆకాంక్షించారు. పూజా కార్యక్రమాలకు కాలనీ ప్రజలు, భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో మండపం భక్తులతో కిక్కిరిసింది. భక్తులు గణనాథుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ ఎనమల్ల రమేష్, విష్ణు వినాయక ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

# పేదల కళ్లలో వెలుగే మా లక్ష్యం

**కంటి వైద్యం అందక ఎవరూ ఇబ్బంది పడకూడదు**
**సేవా కార్యక్రమాలు నిరంతరం కొనసాగిస్తాం : సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి**



**ఆమనగల్లు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కంటి సమస్యలతో బాధపడే పేదలకు ఉచితంగా వైద్య సేవలు అందించి వారి జీవితాల్లో వెలుగు నింపడమే తమ లక్ష్యమని ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, టాస్క్ సీఓఓ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి తెలిపారు. కడ్తాల్‌లోని ఎంబీఏ గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన ఆరో మెగా ఉచిత కంటి వైద్య శిబిరం ముగింపు సందర్భంగా ఆయన మాట్లాడారు. ఆర్థిక స్థోమత లేక కంటి వైద్యం పొందలేని వారు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో ఉచిత కంటి వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వెల్దండలో ప్రారంభమైన సేవా ప్రయాణం ఆమనగల్లు, కల్వకుర్తి, మాడ్గుల, తలకొండపల్లి మీదుగా కడ్తాల్ వరకు కొనసాగిందన్నారు. ఆరు శిబిరాల్లో 19,791 మందికి పైగా కంటి పరీక్షలు నిర్వహించగా, 15,497 మందికి పైగా ఉచిత కంటి అద్దాలు అందించామని, 876 మందికి ఉచిత కంటి శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు వివరించారు. కడ్తాల్ శిబిరంలో 3,591 మందికి కంటి పరీక్షలు నిర్వహించి, 2,422 మందికి ఉచిత కంటి అద్దాలు అందించామని, కంటి శుక్లాలతో బాధపడుతున్న 154 మందికి ఉచితంగా శస్త్రచికిత్సలు నిర్వహించినట్లు తెలిపారు. శంకర నేత్రాలయ వైద్యుడు డాక్టర్ విష్ణు భరత్, సూపర్‌వైజర్ భానుప్రకాశ్‌రెడ్డి, సర్పంచ్ దాస్ నాయక్ సేవా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యారు. ఐక్యత ఫౌండేషన్ సభ్యులు తల్లోజు రఘు, ఎగిరిశెట్టి లింగం, రాచ సీతారాములు, నరేందర్‌గౌడ్, చంద్రశేఖర్, జగన్, కొండల్‌యాదవ్, రమేష్‌యాదవ్, మల్లేష్, శ్రీపతి, శేఖర్, మల్లేష్‌నాయక్, శ్రీను, మహేష్ తదితరులు శిబిరం నిర్వహణలో సేవలందించారు. కంటి శిబిరాలు పూర్తయినా సేవా కార్యక్రమాలు ఆగవని, ప్రజల అవసరాలకు అనుగుణంగా ఆరోగ్యం, విద్య, ఉపాధి రంగాల్లో సేవలను మరింత విస్తృతంగా కొనసాగిస్తామని సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి పేర్కొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

**ఆమనగల్లు అభివృద్ధిపై కాంగ్రెస్ నేతల మంతనాలు.**
**పార్టీ బలోపేతంపైనా ప్రత్యేక దృష్టి**



**ఆమనగల్లు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతో పాటు ఆమనగల్లు పట్టణ అభివృద్ధికి సమన్వయంతో ముందుకు సాగాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి సూచించారు. ఆమనగల్లు పట్టణ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం, మున్సిపల్ చైర్మన్ పత్యానాయక్‌తో పాటు ముఖ్య నాయకులతో ఎమ్మెల్యే సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పట్టణంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులు, ప్రజలు ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలు, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై నాయకులతో చర్చించారు. సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు అందుతున్న ప్రయోజనాలు, క్షేత్రస్థాయిలో ఎదురవుతున్న సమస్యలను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ప్రజల నుంచి వచ్చే సమస్యలను ఎప్పటికప్పుడు గుర్తించి సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ పరిష్కారానికి కృషి చేయాలని ఎమ్మెల్యే సూచించారు. పట్టణ అభివృద్ధిలో ప్రజల అవసరాలకు ప్రాధాన్యం ఇస్తూ పెండింగ్ సమస్యలను పరిష్కరించే దిశగా కార్యాచరణ చేపట్టాలని చర్చించారు. పార్టీ శ్రేణుల మధ్య సమన్వయాన్ని మరింత పెంచి గ్రామ, వార్డు స్థాయిలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడంతో పాటు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉండాలని సూచించారు. ప్రజా సమస్యల పరిష్కారం, అభివృద్ధి కార్యక్రమాల అమలులో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్యే పేర్కొన్నారు. సమావేశంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పూసల సత్యం, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, అబ్దుల్ అలీమ్, కొండల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఫరీద్, నాజర్, పరమేష్, సలీం తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల ఆరోగ్యమే ప్రాధాన్యం

**ఆసుపత్రిని త్వరగా అందుబాటులోకి తెస్తాం**
**నాణ్యతలో రాజీ లేదు.. అన్ని వసతులతో 50 పడకల ఆసుపత్రిని పూర్తి చేయాలి: ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**



**ఆమనగల్లు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ప్రజల ఆరోగ్య అవసరాలను దృష్టిలో పెట్టుకుని ఆమనగల్లు ప్రభుత్వ ఆసుపత్రిని అన్ని వసతులతో అభివృద్ధి చేయడమే లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. ఆమనగల్లు పట్టణంలో రూ.17.50 కోట్లతో నిర్మిస్తున్న 50 పడకల ఆధునిక ప్రభుత్వ ఆసుపత్రి పనులను మున్సిపల్ చైర్మన్ పత్యనాయక్, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మున్సిపల్ అధ్యక్షుడు అవ్వారి శివలింగం లతో కలిసి ఆదివారం పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. "ఆసుపత్రి నిర్మాణంలో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండకూడదు. పనులను వేగంగా పూర్తి చేసి నిర్ణీత గడువులోగా ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి. ప్రజల ఆరోగ్యానికి ఉపయోగపడేలా ఆసుపత్రిలో అవసరమైన అన్ని సదుపాయాలను కల్పించాలి" అని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. వైద్య పరికరాలు, లిఫ్ట్, మార్చురీ, డైట్ తదితర ఏర్పాట్లను పూర్తి చేయాలని సూచించారు. ఆసుపత్రి ఆవరణను ముందున్న రహదారి కంటే ఎత్తుగా నిర్మించాలని, భవిష్యత్‌లో వర్షపు నీరు, ఇతర సమస్యలు తలెత్తకుండా నిర్మాణంలోనే తగిన జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. సీహెచ్‌సీ భవనానికి సంబంధించిన అసంపూర్తి పనులను త్వరగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకురావాలని గుత్తేదారును ఆదేశించారు. "భవనం నిర్మించి వదిలేయడం కాదు.. ప్రజలకు పూర్తి స్థాయి వైద్య సేవలు అందేలా సదుపాయాలు, సిబ్బంది అందుబాటులో ఉండాలి" అని పేర్కొన్నారు. సీహెచ్‌సీకి అవసరమైన స్టాఫ్ క్యాడర్ స్ట్రెంత్ అంశాన్ని మంత్రి దామోదర రాజనర్సింహ దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని తెలిపారు. 50 పడకల ఆసుపత్రి పూర్తయితే ఆమనగల్లు పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు ఆధునిక వైద్య సేవలు మరింత చేరువ అవుతాయని ఎమ్మెల్యే అన్నారు. ప్రజలు వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గేలా స్థానికంగా వైద్య మౌలిక వసతులను బలోపేతం చేయడంపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు. అనంతరం ఆసుపత్రి నిర్మాణ పనుల పురోగతి, వివిధ విభాగాల ఏర్పాట్లు, నాణ్యత ప్రమాణాలను అధికారులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, పూసల సత్యం, ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎంగలి ప్రసాద్, మెకానిక్ బాబా, వగ్గు మహేష్, అబ్దుల్ అలీమ్, కొండల్‌రెడ్డి, యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వస్పుల శ్రీకాంత్, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ ఫరీద్, శ్రీశైలం, నాజర్, పరమేష్, ఫిరోజ్, సలీం తదితరులు పాల్గొన్నారు.

# వినాయకుడి సన్నిధిలో ప్రత్యేక హోమం

**భక్తిశ్రద్ధలతో పూజలు**
**గ్రామ సుఖసంతోషాల కోసం ప్రత్యేక ప్రార్థనలు**



**ఆమనగల్లు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఆమనగల్లు మండలంలోని శెట్టిపల్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీ అలివేలు మంగ వేంకటేశ్వర సమేత ఆలయం వద్ద ఏర్పాటు చేసిన వినాయక మండపంలో ఆదివారం ప్రత్యేక హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో గణనాథుడికి ప్రత్యేక పూజలు చేసి, వేద మంత్రోచ్ఛారణల మధ్య హోమ కార్యక్రమాన్ని చేపట్టారు. హోమంతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంది. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాలని, ప్రతి కుటుంబంలో ఆయురారోగ్యాలు, శాంతి నెలకొనాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా పండాలని, గ్రామంలో సుభిక్షం, సంతోషం వెల్లివిరియాలని వినాయకుడిని ప్రార్థించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తెల్గమల్ల జంగమ్మ, వెంకటయ్య, ఉపసర్పంచ్ కృష్ణప్రసాద్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, భక్తులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# నరహరిరెడ్డికి ఘన నివాళి

25 ఏళ్ల ప్రజాసేవను గుర్తు చేసుకున్న కాంగ్రెస్ నాయకులు



**ఆమనగల్లు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** తలకొండపల్లి మండలం పడకల్ గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ లట్టుపల్లి నరహరిరెడ్డి మృతికి తలకొండపల్లి మండల కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు డోకూరి ప్రభాకర్‌రెడ్డి, దేవునిపడకల్ మాజీ సర్పంచ్ కాడమోని శ్రీశైలం సంతాపం తెలిపారు. ఆదివారం హైదరాబాద్ కర్మన్‌ఘాట్‌లోని నరహరిరెడ్డి నివాసానికి వెళ్లిన వారు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నరహరిరెడ్డి 25 ఏళ్లపాటు గ్రామ సర్పంచ్‌గా కొనసాగి ప్రజలకు సేవలందించారని గుర్తు చేశారు. గ్రామ అభివృద్ధితోపాటు ప్రజల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేశారని తెలిపారు. ప్రజల సంక్షేమానికి అంకితభావంతో పనిచేసిన ఆయన సేవలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ గ్రామ అభివృద్ధిలో తనదైన ముద్ర వేశారని అన్నారు. నరహరిరెడ్డి మృతి గ్రామ ప్రజలకు, ఆయనను అభిమానించే వారికి తీరని లోటని పేర్కొన్నారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కార్యక్రమంలో లట్టుపల్లి మధుసూదన్‌రెడ్డి, అమృతలింగం, అంబటి రమేష్, కాడమోని నర్సింహ, అంబటి బిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

# స్నేహబంధానికి నిలువెత్తు నిదర్శనం

మిత్రుడి కుటుంబానికి ఆపన్నహస్తం అందించిన 2001 - 02 బ్యాచ్ స్నేహితులు



**ఆమనగల్లు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** చదువుకున్న నాటి స్నేహబంధాన్ని మరువకుండా ఆపదలో ఉన్న మిత్రుడి కుటుంబానికి తోటి స్నేహితులు అండగా నిలిచారు. ఆమనగల్లు పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో 2001--02 విద్యా సంవత్సరంలో కలిసి చదువుకున్న ఎం.డి. సర్వర్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. స్నేహితుడి మృతితో విషాదంలో ఉన్న మిత్రులు ఆయన అదివారం కుటుంబాన్ని పరామర్శించి, తమ వంతు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా మిత్రులు మాట్లాడుతూ.. సర్వర్ తమ మధ్య లేకపోవడం తీరని లోటని ఆవేదన వ్యక్తం చేశారు. మిత్రుడి కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న నేపథ్యంలో కష్టకాలంలో అండగా నిలవడం తమ బాధ్యతగా భావించి ఈ సహాయం అందించినట్లు తెలిపారు. సర్వర్ కుటుంబానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని, భవిష్యత్తులోనూ అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. స్నేహం అంటే కేవలం సంతోషాల్లో కలిసి ఉండటం కాదని, కష్టకాలంలో తోడుగా నిలవడమే నిజమైన స్నేహానికి నిదర్శనమని మిత్రులు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎర్రవోలు రాజు, వరికుప్పల నిరంజన్, కిషోర్, మజీద్ పాషా తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత పోలీస్ శిక్షణకు విశేష స్పందన

ప్రాథమిక పరీక్షకు 2,250 మంది 500 మందికి ఉచిత శిక్షణ



**నల్లగొండ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** పోలీస్ ఉద్యోగాల కోసం సిద్ధమవుతున్న నిరుద్యోగ యువతకు నల్లగొండ జిల్లా పోలీసులు నిర్వహించిన ప్రాథమిక పరీక్షకు 2,250 మంది హాజరయ్యారు. వీరిలో ప్రతిభ ఆధారంగా 500 మందిని నల్లగొండ పోలీస్ శిక్షణ కేంద్రంలో ఉచిత శిక్షణకు ఎంపిక చేయనున్నట్లు ఎస్పీ శరత్‌చంద్ర పవార్ తెలిపారు. ఎంపికైన వారికి నిపుణుల మార్గదర్శకత్వం, నమూనా పరీక్షలు, సందేహ నివృత్తి, శారీరక దృఢత్వ శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని క్రమశిక్షణతో శ్రమించాలని ఎస్పీ సూచించారు.

# ప్రజాసేవలో నరహర్‌రెడ్డి చెరగని ముద్ర

**25 ఏళ్లపాటు సర్పంచ్‌గా ప్రజలకు సేవ కాంగ్రెస్ అభివృద్ధికి నిరంతర కృషి: ఎంపీ మల్లు రవి**



**ఆమనగల్లు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** పడకల్ గ్రామ ప్రజా జీవితంలో చెరగని ముద్ర వేసిన మాజీ సర్పంచ్, మాజీ సమితి అధ్యక్షుడు, మాజీ మార్కెట్ చైర్మన్ లట్టుపల్లి నరహర్‌రెడ్డి మృతి తీవ్రంగా బాధించిందని నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి అన్నారు. ఆయన మరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని పేర్కొన్నారు. గ్రామ ప్రజలతో మమేకమై 25 ఏళ్లపాటు సర్పంచ్‌గా కొనసాగిన నరహర్‌రెడ్డి ప్రజా సేవలో ప్రత్యేక గుర్తింపు పొందారని మల్లు రవి తెలిపారు. ఆమనగల్లు పంచాయతీ సమితి పరిధిలో కాంగ్రెస్ పార్టీకి పెద్దదిక్కుగా ఉంటూ పార్టీ బలోపేతానికి నిరంతరం కృషి చేశారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థుల విజయానికి ఆయన అందించిన సహకారం మరువలేనిదన్నారు. కాంగ్రెస్ పార్టీ అభివృద్ధి కోసం నరహర్‌రెడ్డి చేసిన సేవలు చిరస్మరణీయమని ఎంపీ పేర్కొన్నారు. ఆయన మృతి పార్టీకి, ప్రజా జీవితానికి తీరని లోటని అన్నారు. నరహర్‌రెడ్డి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# నిమజ్జనం ఏర్పాట్లపై కలెక్టర్ పరిశీలన



**దేవరకొండ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గణేష్ నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా కొండభీమనపల్లి చెరువులో చేపట్టిన వినాయక నిమజ్జన ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ బడుగు చంద్రశేఖర్, ఎస్పీ శరత్‌చంద్ర పవార్, సబ్ కలెక్టర్ కరోలిన్ చింగ్టియాన్ మావి ఆదివారం పరిశీలించారు. లోతైన ప్రాంతాల్లో బారికేడ్లు ఏర్పాటు చేయాలని, ఘాట్ల వద్ద గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచాలని అధికారులను ఆదేశించారు. రాత్రివేళ భక్తులకు ఇబ్బందులు లేకుండా హైమాస్ట్ లైట్లు, అదనపు విద్యుత్ సౌకర్యం కల్పించాలని సూచించారు. వైద్య సిబ్బంది, మందులు, అంబులెన్స్‌ను సిద్ధంగా ఉంచాలని, అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి నిమజ్జనాన్ని ప్రశాంతంగా నిర్వహించాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ వెంకట్‌రెడ్డి, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, కమిషనర్ రామదుర్గారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలి

**నల్లగొండ సభకు వేలాదిగా రైతులు తరలిరావాలి: పాలడుగు నాగార్జున**



**నల్లగొండ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నవంబర్ 15 నుంచి 20 వరకు నల్లగొండలో నిర్వహించనున్న రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు పాలడుగు నాగార్జున పిలుపునిచ్చారు. చందనపల్లి గ్రామంలో ఆదివారం నిర్వహించిన ఇంటింటి ప్రచారంలో ఆయన మాట్లాడారు. రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర కల్పించాలని, రైతుల మోటార్లకు విద్యుత్ మీటర్ల ఏర్పాటుపై నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. సమగ్ర పంటల బీమా అమలు చేయాలని, వ్యవసాయానికి నిరంతర విద్యుత్, సాగునీరు అందించాలని కోరారు. నల్లగొండలోని ఎన్జీ కళాశాలలో జరిగే బహిరంగ సభకు వేలాదిగా రైతులు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కొండ అనురాధ, ఉప్పుల గోపాలు, పోలే సత్యనారాయణ, కొండ వెంకన్న, గంగుల యాదయ్య, రూపని లింగయ్య, తంతనపల్లి సైదమ్మ, నల్ల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

# ట్రాన్స్‌పోర్టు డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి



**నల్లగొండ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ట్రాన్స్‌పోర్టు కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి అన్ని రకాల సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు దండెంపల్లి సత్తయ్య డిమాండ్ చేశారు. ఆదివారం దేవరకొండ రోడ్డులో ట్రాలీ ఆటో డ్రైవర్లు, కార్మికుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల, ఆన్‌లైన్ సరుకు రవాణా సంస్థల కారణంగా డ్రైవర్లకు గిట్టుబాటు కూలి లభించడం లేదన్నారు. ఎన్నికల హామీ మేరకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. నల్లగొండలో అద్దె ఇళ్లలో ఉంటున్న డ్రైవర్లకు ఇందిరమ్మ టవర్లలో ఇళ్లు కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. అనంతరం యూనియన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా జడల సోములు, కార్యదర్శిగా ఈర్ల శ్రీశైలం, కోశాధికారిగా ఈసం హుస్సేన్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# గణేష్ నిమజ్జన ఏర్పాట్ల పరిశీలన



**మర్రిగూడ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** గణేష్ నిమజ్జన ప్రాంతాలను తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీడీవో మున్నయ్య, ఎస్ఐ బి.రాంబాబు ఆదివారం పరిశీలించారు. ఎరగండ్లపల్లి కాలువ, కిష్టారంపల్లి జలాశయ ప్రాంతాల్లో ఏర్పాట్లను పరిశీలించి, నిమజ్జనం సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రెవెన్యూ సిబ్బంది, హోంగార్డు తదితరులు పాల్గొన్నారు.

# శివను పరామర్శించిన అదనపు సంచాలకుడు శ్రీధర్

**త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష**



**పంజాగుట్ట, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మాసాబ్‌ట్యాంక్‌లోని డీఎస్ఎస్ భవన్‌లో కంప్యూటర్ సాంకేతిక సేవల ఇన్‌చార్జిగా పనిచేస్తున్న శివ అనారోగ్యంతో నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న ఎస్సీడీడీ అదనపు సంచాలకుడు శ్రీధర్ ఆదివారం ఆస్పత్రికి వెళ్లి శివను పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితి, అందుతున్న చికిత్స వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని సూచిస్తూ శివ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. శివ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. తమ కుమారుడిని పరామర్శించి ధైర్యం చెప్పిన శ్రీధర్‌కు శివ తల్లి, సోదరి హారిక, కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

# మేరమాయిడి మందిర నిర్మాణానికి రూ.51 వేల విరాళం అందచేసిన జూపల్లి భాస్కరరావు



**కల్వకుర్తి, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** వెల్దండ మండలం నగరగడ్డ తండాలో మేరమాయిడి నూతన మందిర నిర్మాణానికి వెల్దండ సింగిల్‌విండో చైర్మన్ జూపల్లి భాస్కరరావు ఆదివారం రూ.51 వేల విరాళం అందజేశారు. మందిర నిర్మాణ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందించి, నిర్మాణ వివరాలను తండా నాయకులను అడిగి తెలుసుకున్నారు. ఆలయ అభివృద్ధికి సహకరించడం ఆనందంగా ఉందని, అమ్మవారి ఆశీస్సులు తండా ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా తండావాసులు జూపల్లి భాస్కరరావును అభినందించారు. కార్యక్రమంలో తండా నాయకులు, స్థానికులు పాల్గొన్నారు.

# అనఘాపూరి కాలనీలో ఘనంగా లక్ష్మీ గణపతి హోమం, అన్నప్రసాద వితరణ



**మేడిపల్లి, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** అనఘాపూరి కాలనీలో గణేష్ నవరాత్రోత్సవాల సందర్భంగా ఆదివారం లక్ష్మీ గణపతి హోమం, అన్నప్రసాద వితరణ నిర్వహించారు. కాలనీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బోడుప్పల్ మాజీ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, మాజీ కార్పొరేటర్లు పోగుల నరసింహారెడ్డి, సింగిరెడ్డి పద్మారెడ్డి, కాంగ్రెస్ నాయకులు కొత్త కిషోర్‌గౌడ్, బొమ్మక్ కళ్యాణ్, పోగుల దిలీప్‌రెడ్డి తదితరులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెల్లంకి బాలచందర్‌రెడ్డి అన్నదాతగా వ్యవహరించగా.. కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు రావుల శ్రీనివాస్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఏనుగు సంజీవరెడ్డి, కార్యవర్గ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు.

# నేడు ఎమ్మెల్యే చేతుల మీదుగా వేరుశనగ విత్తనాల పంపిణీ



**కల్వకుర్తి, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని రైతు వేదికలో సోమవారం ఉదయం 11.30 గంటలకు వేరుశనగ విత్తనాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్లు పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు పుస్తకాల రాములు తెలిపారు. ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి చేతుల మీదుగా విత్తనాల పంపిణీ జరుగుతుందని ఆదివారం వెల్లడించారు.

# బోడుప్పల్‌లో ఘనంగా అన్నదానం

**500 మందికి అన్నప్రసాద వితరణ**



**బోడుప్పల్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** రాజీవ్ నగర్ డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దానగాళ్ల యాదగిరి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. లబ్ధిదారులు చందాలు వేసుకుని గణేష్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి 500 మందికి అన్నదానం చేయడం అభినందనీయమని యాదగిరి అన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు చిప్పల శ్రీధర్ మాట్లాడుతూ.. రెండో ఏడాది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని, కులమతాలకు అతీతంగా సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు, కాలనీ వాసులు పాల్గొన్నారు.

# ర్యాకల్‌దేవ్‌పల్లిలో గణపతికి ప్రత్యేక పూజలు





**ఎలిగేడు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని ర్యాకల్‌దేవ్‌పల్లి గ్రామంలో గణేష్ యూత్ ఆధ్వర్యంలో గణేష్ ఉత్సవాల్లో భాగంగా ఆదివారం వినాయకుడికి కుంకుమ పూజ నిర్వహించారు. సర్పంచ్ మద్దెల రమాదేవి, సంపత్ దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖ సంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. ఎలిగేడు మండల కేంద్రంలోని శ్రీ భవాని రామలింగేశ్వర ఆలయంలో ప్రతిష్ఠించిన విఘ్నేశ్వరునికి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ శివకృష్ణగౌడ్, గణేష్ యూత్ కమిటీ చైర్మన్ దోనపాటి తిరుపతిరెడ్డి, ఆర్యవైశ్య సంఘం నాయకులు కేశెట్టి కాశీనాథం, మణికంఠ, మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

# యరగండ్లపల్లిలో వివాహిత అదృశ్యం



**మర్రిగూడ, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** మండలంలోని యరగండ్లపల్లి గ్రామానికి చెందిన తోకల లక్ష్మి (34) శనివారం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయినట్లు ఆమె భర్త తోకల యాదయ్య ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బి.రాంబాబు తెలిపారు. లక్ష్మి ఆచూకీ తెలిసిన వారు మర్రిగూడ ఎస్ఐ 8712670231 నంబర్‌కు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

# దుర్శేడ్‌లో ఎస్‌బిఐ ఏటీఎం చోరీ

**కరీంనగర్ రూరల్, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్) :** దుర్శేడ్ గ్రామ శివారులోని ఎస్‌బిఐ ఏటీఎం లో గుర్తు తెలియని వ్యక్తులు గ్యాస్ కట్టర్‌తో యంత్రాన్ని ధ్వంసం చేసి నగదు అపహరించారు. సీఎంఎస్ ఇన్ఫో సిస్టమ్స్ లిమిటెడ్ ప్రతినిధి ఫిర్యాదు మేరకు, ఏటీఎం లో రూ.9,84,600 నగదు ఉండగా, దాదాపు రూ.8,85,100 మొత్తాన్ని దొంగలు తీసుకెళ్లినట్లు వెల్లడైంది. పోలీసులు కేసు నమోదు చేసి సీసీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు సేకరిస్తున్నారు. నిందితులను పట్టుకునేందుకు నాలుగు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపట్టారు. రూరల్ పోలీసులు అన్ని కోణాల్లో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను కొనసాగించాలి

**వర్ధంతి కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, చేనేత కార్మికులు తరలిరావాలి**
**తెలంగాణ చేనేత ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్**



**ఆమనగల్లు, సెప్టెంబర్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** స్వాతంత్ర్య సమరయోధులు, తెలంగాణ ఉద్యమ స్ఫూర్తిదాత, చేనేత రంగ అభ్యున్నతికి విశేషంగా కృషి చేసిన శ్రీ కొండా లక్ష్మణ్ బాపూజీ ఆశయాలను నేటి తరానికి అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలంగాణ చేనేత ఐక్యవేదిక రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు గాజుల శ్రీనివాస్ అన్నారు. ఈ నెల 21న సోమవారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకుని ఆమనగల్లు మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించనున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలక పాత్ర పోషించిన కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ ప్రజల హక్కులు, ఆత్మగౌరవం కోసం జీవితాంతం పోరాడారని గాజుల శ్రీనివాస్ పేర్కొన్నారు. ముఖ్యంగా చేనేత కార్మికుల సంక్షేమం, వారి హక్కుల పరిరక్షణ కోసం ఆయన చేసిన కృషి స్ఫూర్తిదాయకమన్నారు. బాపూజీ ఆశయాలను స్మరించుకోవడంతో పాటు వాటి సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. వర్ధంతి సందర్భంగా నిర్వహించే కార్యక్రమానికి ఆమనగల్లు మండల ప్రజా ప్రతినిధులు, మున్సిపాలిటీ పద్మశాలి నాయకులు, చేనేత కార్మికులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు, యువత, బాపూజీ అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై ఘనంగా నివాళులర్పించాలని కోరారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు చేనేత వర్గాలు, ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయంతో ముందుకు రావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



## నాని 'ది ప్యారడైజ్' సినిమాలో 'పొడుస్తున్న పొద్దుమీద'?

నేచురల్ స్టార్ నాని హీరోగా, శ్రీకాంత్ ఓదెల దర్శకత్వంలో తెరకెక్కుతున్న మోస్ట్ అవేటెడ్ మాస్ యాక్షన్ మూవీ 'ది ప్యారడైజ్'. ఇప్పటికే ఈ సినిమా నుంచి వచ్చిన అప్‌డేట్స్ ప్రేక్షకుల్లో భారీ అంచనాలను క్రియేట్ చేయగా, తాజాగా మ్యూజికల్ ఫీస్ట్‌కు సంబంధించిన ఒక క్రేజీ అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఈ చిత్రంలో రాక్ స్టార్ అనిరుధ్ రవిచందర్ సంగీతంలో రాబోతున్న పాటల జాబితా నెట్టింట హాట్ టాపిక్‌గా మారింది. తెలంగాణ ఉద్యమ గీతంగా కోట్లాది మంది ప్రజల హృదయాలను హత్తుకున్న ప్రసిద్ధ ప్రజా యుద్ధ నౌక గద్దర్ అమూల్యమైన గీతం 'పొడుస్తున్న పొద్దుమీద నడుస్తున్న కాలమా...' పాటను ఈ సినిమాలో ఉపయోగిస్తున్నట్లు ఇన్‌సైడ్ టాక్ గట్టిగా వినిపిస్తోంది. ఇప్పటికే 'ఆయా షేర్', 'ఏష నాగుల' పాటలతో పాటు ఈ ఐకానిక్ ఫోక్ సాంగ్ కూడా సినిమాలో చోటు చేసుకుంటే, థియేటర్లలో ప్రేక్షకుల ఊపు చూసి థియేటర్లు ఊగిపోవడం ఖాయమని సినీ వర్గాలు అంటున్నాయి. అనిరుధ్ మ్యూజిక్, శ్రీకాంత్ ఓదెల టేకింగ్, నాని మాస్ పెర్ఫార్మెన్స్‌కు తోడు ఈ ఫోక్ సాంగ్ తాలుక వైబ్స్ తోడైతే సిల్వర్ స్క్రీన్ మీద రికార్డులు తిరగరాయడం పక్కా అని అభిమానులు అంచనా వేస్తున్నారు. అయితే దీనిపై చిత్రయూనిట్ ఎటువంటి అధికారిక ప్రకటన చేయలేదు. ఇవి కేవలం రుమర్స్ అని నెటిజన్లు కామెంట్లు పెడుతున్నారు.

## రా అండ్ రస్టిక్‌గా ఆశిష్ గాంధీ 'డానీ'.. అంచనాలు పెంచుతున్న ఫస్ట్ స్ట్రైక్ గ్లింప్స్!




టాలీవుడ్ ప్రేక్షకులను ఎంతగానో అలరించేందుకు మరో రా అండ్ రస్టిక్ యాక్షన్ ఎంటర్‌టైనర్ సిద్ధమవుతోంది. ఆశిష్ గాంధీ హీరోగా, కళ్యాణ్‌జీ గోగణ దర్శకత్వంలో తెరకెక్కుతున్న లేటెస్ట్ మూవీ 'డానీ'. రిజ్వాన్ ఎంటర్‌టైన్మెంట్, కళ్యాణ్‌జీ కంటెంట్ పిక్చర్స్ బ్యానర్లపై రిజ్వాన్ అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు సంబంధించిన 'ఫస్ట్ స్ట్రైక్' టీజర్ తాజాగా విడుదల కాగా, సినిమాపై అంచనాలు ఒక్కసారిగా తారాస్థాయికి చేరాయి. టీజర్ ఆరంభంలోనే "నువ్వు బీచ్‌కి ఎప్పుడూ ఒంటరిగా వస్తావా?" అని హీరోయిన్ అడిగే ప్రశ్నకు, హీరో చెప్పే బోల్డ్ ఆన్సర్ యూత్ ఆడియెన్స్‌ను ఇన్‌స్టంట్‌గా కనెక్ట్ చేసేలా ఉంది. రొమాంటిక్ క్రైమ్ డ్రామాగా రూపొందుతున్న ఈ చిత్రంలో కేవలం రొమాన్స్ మాత్రమే కాకుండా, థ్రిల్ గొలిపే యాక్షన్ సన్నివేశాలకు కూడా పెద్ద పీట వేసినట్లు స్పష్టమవుతోంది. బీచ్ బ్యాక్‌డ్రాప్‌లో వచ్చే విజువల్స్, నటీనటుల గ్లామర్ అప్పీల్ సినిమాపై క్యూరియాసిటీని పెంచుతున్నాయి. ఇప్పటికే దర్శకుడు కళ్యాణ్‌జీ గోగణ, హీరో ఆశిష్ గాంధీ కాంబినేషన్‌లో వచ్చిన 'నాటకం', 'కళింగ' చిత్రాలు బాక్సాఫీస్ వద్ద మంచి విజయాన్ని సాధించాయి. ఈ సక్సెస్‌ఫుల్ కాంబినేషన్ హ్యాట్రిక్ కొట్టడానికి 'డానీ'తో వస్తుండటంతో సినీ వర్గాల్లోనూ మంచి బజ్ ఏర్పడింది. ఈ చిత్రంలో సేజల్ గుప్తా, సోనాల్ సింగ్, అజర్ ఖాన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. టెక్నికల్ పరంగా కూడా 'డానీ' ఫస్ట్ స్ట్రైక్ అత్యున్నత ప్రమాణాలతో నిలిచింది. ఏ ఆనంద్ సినిమాటోగ్రఫీ చాలా రిచ్‌గా, కలర్ ఫుల్‌గా ఉంది. ఇక మ్యూజిక్ డైరెక్టర్ సాయి కార్తీక్ అందించిన బ్యాక్‌గ్రౌండ్ మ్యూజిక్ టీజర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచింది. విజువల్స్‌ను మరింత ఎలివేట్ చేసేలా బీజీఎం అదరగొట్టింది. ఖుషి సహ నిర్మాతగా వ్యవహరిస్తున్న ఈ చిత్రానికి మణికాంత్ ఎడిటర్‌గా, రామ్ సుంకర, కళ్యాణ్‌జీ గోగణ యాక్షన్ కొరియోగ్రాఫర్లుగా వర్క్ చేస్తున్నారు. త్వరలోనే ఈ చిత్రానికి సంబంధించిన మరిన్ని ఆసక్తికరమైన అప్‌డేట్స్‌ను మేకర్స్ విడుదల చేయనున్నారు. అన్ని కార్యక్రమాలను పూర్తి చేసి అక్టోబర్ నెలలో ఈ సినిమాను గ్రాండ్‌గా థియేటర్లలోకి తీసుకురావడానికి సన్నాహాలు చేస్తున్నారు. రా అండ్ రస్టిక్ ఎలిమెంట్స్‌తో రాబోతున్న ఈ 'డానీ' బాక్సాఫీస్ వద్ద ఎలాంటి సంచలనాలు సృష్టిస్తుందో వేచి చూడాలి!




## విజయ్ వారసుడి అరంగేట్రం.. 'సిగ్మా' ట్రైలర్‌తో అదరగొట్టిన జేసన్ సంజయ్, సందీప్ కిషన్!

తమిళనాడు సీఎం స్టార్ హీరో దళపతి విజయ్ వారసుడిగా సినీ రంగంలోకి అడుగుపెడుతున్న జేసన్ సంజయ్ దర్శకుడిగా పరిచయమవుతున్న మోస్ట్ అవేటెడ్ మూవీ 'సిగ్మా'. టాలెంటెడ్ హీరో సందీప్ కిషన్ ప్రధాన పాత్రలో నటిస్తున్న ఈ హై-ఆక్టేన్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌కు సంబంధించిన అధికారిక ట్రైలర్‌ను చిత్రబృందం తాజాగా విడుదల చేసింది. ట్రైలర్ చూస్తే.. ఇది పూర్తిగా గ్యాంబ్లింగ్, డ్రగ్స్ మరియు ఒక మనీ హైస్ట్ నేపథ్యంలో సాగే రంగుల ప్రపంచం చుట్టూ తిరిగే పర్ఫెక్ట్ యాక్షన్ డ్రామాగా రూపొందినట్లు స్పష్టమవుతోంది. ఇందులో సందీప్ కిషన్ ఒక వైవిధ్యమైన రేడియో జాకీ పాత్రలో కనిపిస్తూనే, మరోవైపు అండర్ వరల్డ్ డాన్‌గా చెలరేగుతున్న సంపత్ రాజ్ సామ్రాజ్యాన్ని దెబ్బకొట్టే సాహసోపేతమైన మిషన్‌లో కనిపించడం విశేషం. ట్రైలర్ అంతటా కనిపిస్తున్న విజువల్స్, యాక్షన్ సీక్వెన్స్‌లు మరియు బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ సినిమాపై ఆసక్తిని రెట్టింపు చేస్తున్నాయి. ఈ చిత్రంలో సందీప్ కిషన్ సరసన టాలెంటెడ్ బ్యూటీ ఫరియా అబ్దుల్లా కథానాయికగా నటిస్తుండగా, సంపత్ రాజ్, శివ్ పండిట్, ప్రముఖ కొరియోగ్రాఫర్-నటుడు రాజు సుందరం తదితరులు కీలక పాత్రల్లో తమ నటనతో మెప్పించనున్నారు. ప్రఖ్యాత నిర్మాణ సంస్థ 'లైకా ప్రొడక్షన్స్' పతాకంపై సుభాస్కరన్ అత్యంత భారీ బడ్జెట్‌తో ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఇక చిత్రానికి ప్రముఖ సంగీత దర్శకుడు ఎస్. థమన్ అందిస్తున్న బాణీలు, నేపథ్య సంగీతం ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి. మొత్తానికి, అన్ని హంగులను పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని మహాత్మా గాంధీ జయంతి కానుకగా అక్టోబర్ 2, 2026 న తెలుగు, తమిళ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా గ్రాండ్‌గా థియేటర్లలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం విడుదలైన ఈ ట్రైలర్ యూట్యూబ్ తో పాటు అన్ని సోషల్ మీడియా వేదికలపై టాప్ ట్రెండింగ్‌లో దూసుకుపోతూ అభిమానులను విశేషంగా ఆకట్టుకుంటోంది.

## హాలీవుడ్‌లో నటించాలని ఉంది.. ఆ సినిమాలో నాకు ఛాన్స్ ఇవ్వండి: విజయ్ సేతుపతి

టాలీవుడ్, కోలీవుడ్ అనే తేడా లేకుండా తన విలక్షణ నటనతో ప్రేక్షకులను అలరిస్తున్న మక్కల్ సెల్వన్ విజయ్ సేతుపతి తన కెరీర్ మరియు రాబోయే ప్రాజెక్ట్‌ల గురించి పలు ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఇటీవల నిథిలన్ స్వామినాథన్ తనకు 'మహారాజా 2' కథను వినిపించారని, ఆ కథ వినగానే తనకు ఎంతగానో నచ్చిందని ఆయన వెల్లడించారు. నిథిలన్ ఒక అద్భుతమైన దర్శకుడని ప్రశంసించిన విజయ్ సేతుపతి, మొదటి భాగం 'మహారాజా' విడుదల కాకముందు కొందరు ఈ సినిమాపై నమ్మకం ఉంచలేదని, కానీ తాను మాత్రం సినిమా విజయం సాధిస్తుందని గట్టిగా నమ్మానని గుర్తుచేసుకున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించి తాజాగా హాలీవుడ్ నుంచి ఓ భారీ ఆఫర్ రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. ఇటీవల నిర్మాత తనకు ఫోన్ చేసి 'మహారాజా' సినిమాను హాలీవుడ్‌కు అమ్మేశామని చెప్పారని, ఆ చిత్రంలో హాలీవుడ్ స్టార్ నటుడు మాథ్యూ మెక్‌కానగీ నటించబోతున్నారని తెలిపారన్నారు. ఈ విషయం విన్న వెంటనే తాను ఎంతో థ్రిల్ అయ్యానని, నిర్మాతతో మాట్లాడుతూ 'ఒక సినిమాలో నేను ఉచితంగా నటిస్తాను.. కానీ ఆ హాలీవుడ్ రీమేక్‌లో నాకు కూడా ఒక చిన్న పాత్ర ఇప్పించండి.. నేను అక్కడికి వెళ్లి నటిస్తాను' అని సరదాగా అన్నట్లు విజయ్ సేతుపతి తెలిపారు. తనకు మొదటి నుంచీ హాలీవుడ్‌లో నటించాలనే బలమైన కోరిక ఉందని, తన సినిమా అక్కడకు చేరుకోవడం తనకు ఎంతో ఆనందాన్నిస్తోందని ఆయన మనసులోని మాటలను బయటపెట్టారు. ప్రస్తుతం విజయ్ సేతుపతి చేసిన ఈ వ్యాఖ్యలు సోషల్ మీడియాలో తెగ వైరల్ అవుతున్నాయి.



Published & Printed by Desha Venkateshwarlu Published at H.no 6-2-591, Srinagar colony, Hyd. Road, Dist-Nalgonda, Telangana - 508001. Printed at SNEHITHA PRINTERS H.no 6-2-591,Srinagar colony, Hyd. Road, Dist-Nalgonda, Telangana - 508001. Editor : Desh Venkateshwarlu, RNI : TELTEL/2023/87644, Phone no- 9553338622